అంధుడినని విధుల్లోకి చేర్చుకోకుండా అవమానించారు!

- తహసీల్దారు ఛాంబరులోకి అనుమతించలేదు
- టీటీడీ సభ్యుడు భాను ఎదుట వాపోయిన డీటీ నాగరాజు

తిరుపతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అంధుడినని తనను విధుల్లోకి చేర్చుకోకుండా బీఎన్ కండ్రిగ తహసీల్దారు అవమానించారని, కనీసం తనను ఛాంబరులోకి కూడా అనుమతించలేదంటూ డీటీ బి.నాగరాజు వాపోయారు. అంధుడినైనా రెవెన్యూ శాఖలో వివిధ పోస్టుల్లో పనిచేసిన తాను ఇలా ఏనాడూ వివక్షను, అవమానాన్ని ఎదుర్కోలేదంటూ కంటతడి పెట్టారు. ఈ మేరకు గురువారం మధ్యాహ్నం ఆయన టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డిని కలిసి తనకెదురైన చేదు అనుభవాన్ని వివరించారు. పుట్టుకతో అంధుడినైన తనకు రెవెన్యూ శాఖలో ఉద్యోగం రావడంతో శక్తిమేరకు విధులు నిర్వర్తిస్తున్నానని చెప్పారు. డీటీగా తొట్టంబేడు మండలంలో పనిచేసిన తనకు తాజా బదిలీల్లో బీఎన్ కండ్రిగకు బదిలీ అయిందన్నారు. గత సోమవారం విధుల్లో చేరేందుకు బీఎన్ కండ్రిగ వెళ్ళగా తహసిల్దారు కార్యాలయ గదిలోకి కూడా అనుమతించలేదని, విధుల్లోకి చేర్చుకునేది లేదని చెప్పి పంపించేశారన్నారు. అంధుడినని, విధులకు సంబంధించిన పనులు చేయలేనన్న ఉద్దేశంతోనే అవమానించారన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి భానుప్రకాష్‌రెడ్డి తీసుకెళ్లారు. దీనిపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అవమానించలేదు.. ఆలస్యం జరిగిందంతే

ఈ విషయమై బీఎన్ కండ్రిగ తహసీల్దారు శ్రీదేవిని వివరణ కోరగా.. తాను డిప్యూటీ తహసీల్దారు నాగరాజును అవమానించలేదని, విధుల్లోకి చేర్చుకోవడంలో ఆలస్యం జరిగిందని సమాధానమిచ్చారు. గత సోమవారం విధుల్లోకి చేరేందుకు ఆయన తమ కార్యాలయానికి రాగా ఛాంబరులోకి పిలిచి కూర్చోబెట్టి మాట్లాడానని చెప్పారు. అంధుడైనందున ప్రజల అర్జీలు చదవలేరని, పనులు ఆలస్యమవుతాయని కొందరు అధికార పార్టీ నాయకులు అభ్యంతరం వ్యక్తంచేశారన్నారు. దీనిని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి మరొకరిని డీటీగా కేటాయించాలని కోరే ప్రయత్నంలో డీటీ నాగరాజు విధుల్లోకి చేరడం ఆలస్యమైందన్నారు. బుధవారం జాయింట్ కలెక్టర్ ఫోన్ చేసి డీటీ నాగరాజును విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించారన్నారు. ఆ మేరకు డ్యూటీలో జాయిన్ చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అవమానించారన్న ఆరోపణలు వాస్తవం కాదన్నారు.



టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డితో మాట్లాడుతున్న డీటీ నాగరాజు



తిరుమలలో శ్రీదేవి

'కోర్టు' సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైన శ్రీదేవి గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుమలలో చాలా మార్పులు వచ్చాయని, ప్రసాదాలు, దర్శన విధానాలు బాగున్నాయన్నారు. ఆలయం ముందు శ్రీదేవితో పలువురు సినీ అభిమానులు సెల్ఫీలు తీసుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్‌కు 264 మంది హాజరు

పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకుగాను జిల్లాలో మూడు కేంద్రాల్లో ఆరో రోజైన గురువారం నిర్వహించిన వెబ్ కౌన్సెలింగ్‌కు 264 మంది హాజరయ్యారని జిల్లా కోఆర్డినేటర్, తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ వై. ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. 86,001 నుంచి 1,04,000 ర్యాంకుల వారికి కౌన్సెలింగ్ జరిగింది. ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో కళాశాలలో జరిగిన కౌన్సెలింగ్‌కు 201 మంది హాజరయ్యారు. సత్యవేడులో 10 మంది, గూడూరులో 53 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరై తమ సర్టిఫికెట్లను ధ్రువీకరించుకున్నారు. శుక్రవారం 1,04,001 నుంచి 1,20,000 ర్యాంకుల వారికి కౌన్సెలింగ్ జరగనుంది.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి



ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో వెబ్‌కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

'పీజీఆర్ఎస్'పై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- తహసీల్దార్లు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి
- ప్రభుత్వ ఆస్తులు, శాంతిభద్రతల పరిరక్షణలో మెజిస్టీరియల్ అధికారాలు వినియోగించాలి
- సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్ ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్లను రాష్ట్ర భూపరిపాలన చీఫ్ కమిషనర్ జయలక్ష్మి హెచ్చరించారు. 22ఏ, రీసర్వే హౌసింగ్, జీవో నెంబరు 30 తదితర రెవెన్యూ సంబంధిత అంశాలపై జిల్లా రెవెన్యూ అధికారులతో గురువారం ఆమె కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి సుదీర్ఘంగా సమీక్షించారు. మండలస్థాయిలో పీజీఆర్ఎస్ అర్జీల స్వీకరణకు నోడల్ అధికారులను నియమించాలన్నారు. వచ్చిన అర్జీలపై వారంలోపు నివేదికలు ఇవ్వాలన్నారు. పీజీఆర్ఎస్‌పై ప్రతి తహసీల్దారు అవగాహన పెంచుకోవాలన్నారు. మ్యుటేషన్లు, కులధ్రువీకరణ, చట్టపరమైన అంశాల్లో తప్పిదాలకు తావివ్వరాదన్నారు. వెబ్‌ల్యాండ్‌కు సంబంధించి ఏ ఎంట్రీ అయినా నమోదు చేసేటప్పుడు క్షేత్రస్థాయిలో వీఆర్వో అప్‌లోడ్ చేసే డాక్యుమెంట్లను తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. చట్టంలో లేనివి చేస్తే కఠిన శిక్షలు ఉంటాయని స్పష్టంచేశారు. హౌసింగ్ ఫర్ఆల్ అంశంలో ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించాలని తొలిదశలో కేటగిరి1లో వచ్చే దరఖాస్తుల్లో ప్రభుత్వ భూమి రెడీగా ఉన్నవిపేర్కొనాలన్నారు. దరఖాస్తులు ఎక్కువ వచ్చిన గ్రామాలకు వెళ్లి సబ్ కలెక్టర్, ఆర్డీవోలు పరిశీలించాలన్నారు. ఆ తరువాత ఇంటి పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఆగస్టు 15లోపు పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెగ్యులైజేషన్‌కు సంబంధించి ప్రతి తహసీల్దారు మంగళవారం నుంచి శుక్రవారం వరకు క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లాలన్నారు. భూ ఆక్రమణలు, రెండు వర్గాల మధ్య తగాదాలు తదితర అంశాల్లో తహసీల్దార్లు తమకున్న అధికారులను వినియోగించాలన్నారు. ప్రభుత్వ ఆస్తులు, శాంతి భద్రతల పరిరక్షణలో మెజిస్టీరియల్ అధికారాలు ఉపయోగించాలన్నారు. ప్రజలతో మర్యాదగా నడుచుకున్నప్పుడే రెవెన్యూ శాఖకు మంచిపేరు వస్తుందన్నారు. ఈ సమీక్షల్లో డీఆర్వో నరసింహులు, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఎస్‌డీసీ దేవేంద్రరెడ్డి, సుధారాణి, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, రెవెన్యూశాఖ అధికారులు పాల్గొన్నారు.



జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్ జయలక్ష్మి

రెండు సెంట్ల ఇంటి స్థలాలపై కసరత్తు

ఏర్పేడు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలోని చిందేపల్లిలోని జగనన్న కాలనీ లేఅవుట్‌ను గురువారం సీసీఎల్ఏ చీఫ్ సెక్రటరీ జయలక్ష్మి సందర్శించారు. గత ప్రభుత్వంలో ఇక్కడ సుమారు 250 ఎకరాలు ఇంటి స్థలాలకు కేటాయించారు. తిరుపతి అర్బన్‌కు చెందిన ఇళ్లు లేని పేదలకు సెంటు వంతున అందజేశారు. 210 ఎకరాల్లో ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. మిగిలిన 40 ఎకరాల్లో రెండు సెంట్ల వంతున ఇచ్చేందుకు ప్రస్తుత ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. జేసీ శుభం బన్సల్, తహసీల్దారు భార్గవి, తిరుపతి అర్బన్ తహసీల్దారు తదితరులు పాల్గొన్నారు.



జగన్న కాలనీని సందర్శిస్తున్న సీసీఎల్ఏ చీఫ్ సెక్రటరీ జయలక్ష్మి

రూ.కోటి కొట్టేశారు

రూ.2వేల నోట్ల మార్పిడి ముసుగులో భారీ మోసం

- కేసును ఛేదించి.. నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు
- రూ.73.20 లక్షల నగదు, వాహనాల సీజ్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 26(ఆంధ్రజ్యోతి): రూ.రెండు వేల నోట్లు చెలామణిలో లేవు. తగు ఆధారాలు చూపి రిజర్వు బ్యాంకులో మార్చుకోవచ్చు.ఈ వెసులుబాటునే కొందరు తమ మోసానికి అస్త్రంగా వాడుకున్నారు. తమ వద్ద ఎక్కువ మొత్తంలో రూ.రెండు వేల నోట్లున్నాయని నమ్మించారు. తమకు రూ.500 నోట్లతో రూ.కోటి ఇస్తే..రూ.రెండు వేల నోట్లు రూ.2.5 కోట్లకు ఇస్తామని మైండ్‌గేమ్ ఆడారు. అలా సూళ్లూరుపేటలో ఒకరిని నమ్మించి.. అతడికి రూ.2 వేల నోట్లు ఇవ్వకనే రూ.కోటి కొట్టేశారు. ఈ కేసును పోలీసులు ఛేదించి నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ వివరాలను ఎస్పీ హర్షవర్ధనరాజు గురువారం తిరుపతిలో మీడియాకు వెల్లడించారు.

శ్రీకాకుళం జిల్లా కాశిబుగ్గకు చెందిన అంబటి సంతోష్ అలియాస్ చిన్నస్వామి, ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన బర్రి రవితేజ, తిరుపతికి చెందిన కె.హేమకర్‌రావు, విశాఖపట్నంలోని కంచర్లపాలెంకు చెందిన మామిడి ఉమామహేష్, దొంతిరెడ్డి హరిబాబురెడ్డి ముఠాగా ఏర్పడ్డారు. వీరు పలువురిని కలుస్తూ తమ వద్దనున్న రూ.రెండు వేల నోట్ల కట్టను చూపుతారు. రూ.లక్షకు రూ.500 నోట్లు ఇస్తే రూ.రెండు లక్షలకు సంబంధించి రెండువేల నోట్లు ఇస్తామని, మీకు రిజర్వు బ్యాంకులో ఎవరైనా తెలిసుంటే మార్చుకోవచ్చని చెబుతారు. ఎవరైనా వీరి మాయలో పడితే డబ్బు తీసుకుని, రూ.రెండు వేల నోట్లు ఇవ్వకుండా పారిపోతారు. ఇలా గత నెలలో సూళ్లూరుపేటలో పలువురిని కలిసి 'డీల్' మాట్లాడారు. ఈ క్రమంలో మినీ ఏటీఎం నిర్వాహకుడు జగదీష్ వీరి వలలో పడ్డారు. రూ.కోటి ఇస్తే తాము రూ.రెండున్నర కోట్లకు రూ.రెండు వేల నోట్లు ఇస్తామని అతడిని వీరు నమ్మించారు. దీంతో అతడు రూ.కోటి సిద్ధం చేసుకున్నారు. గతనెల 7వ తేదీ ఈ నిందితులు వాహనాల్లో సూళ్లూరుపేటకు చేరుకుని సమీపంలోని హైవే వద్దకు రమ్మని జగదీష్‌కు చెప్పారు. అతడు రూ.కోటి బ్యాగులతో ఇద్దరు స్నేహితులతో కలిసి అక్కడికి వెళ్లారు. జగదీష్‌తో ఉన్న ఇద్దరిని దగ్గరలోని గదికి వెళితే తమ బాస్ (అంబటి సంతోష్) రూ.రెండువేల నోట్లు రూ.2.50 కోట్లు ఇస్తారని చెప్పి వారిని డైవర్ట్ చేసి పంపారు. అనంతరం జగదీష్ వద్ద ఉన్న రూ.కోటి బ్యాగులను అంబటి సంతోష్ పీఏనని చెప్పిన వ్యక్తి తీసుకుని కారులో పారిపోతుండగా, బాధితుడు అప్రమత్తమై ఆ కారు డోరును పట్టుకున్నారు. కారులోని నిందితులు అతడిని కిందకు నెట్టేసి పరారయ్యారు. మిగిలిన వారూ మరో రెండు వాహనాల్లో పలాయనం చిత్తగించారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు డీఎస్పీ చెంచుబాబుకు విషయం తెలిపి సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ కేసు నమోదు చేశారు. నిందితుల ఆచూకీ కోసం పలు కోణాల్లో దర్యాప్తు చేశారు.



వేలిముద్రలే పట్టిచ్చాయా?

ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి పర్యవేక్షణలో డీఎస్పీ చెంచుబాబు, సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు, డీవీ సత్రం ఎస్ఐ అజయ్‌బాబు, తడ ఎస్ఐ కొండమనాయుడు, ఏఎస్ఐలు, పోలీసులు బృందాలుగా విడిపోయారు. నిందితుల కదలికలు, గతంలో వారు ఎక్కడైనా నేరాలకు పాల్పడ్డారా? ఇలాంటి నేరాలు ఎక్కడ జరిగాయి? అనే కోణాల్లో సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేశారు. మొదట ఈ కేసులో కీలక నిందితుడు అంబటి సంతోష్ వేలిముద్రలు పరిశీలించారు. ఇవి సరిపోవడంతో అతడి కోసం గాలించారు. వారి కదలికలపై దృష్టి సారించిన పోలీసులు అంబటి సంతోష్, బర్రి రవితేజ, ఉమామహేష్‌ను చిల్లకూరు మండలం బూదనం టోల్‌ప్లాజా వద్ద, కె.హేమకర్‌రావును తిరుపతిలో అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.73.20 లక్షల నగదు, రెండు వాహనాలు, ఆరు రూ.2000 నోట్ల డమ్మీ కట్టలు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇదే కేసులో దొంతిరెడ్డి హరిబాబు రెడ్డి పరారీలో ఉన్నాడు. ఈ కేసును ఛేదించడంలో విశేష ప్రతిభ చూపిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందచేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచ్చారి, డీఎస్పీ పాల్గొన్నారు.

అందరూ పాత నేరస్థులే

పోలీసులు అరెస్టు చేసి నలుగురు నిందితులూ పాత నేరస్థులుగా గుర్తించారు. వీరిలో అంబటి సంతోష్‌పై కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో 32వ రౌడీషీటర్‌గా, అలిపిరి, అనకాపల్లి, మాల్కాపురం, కాశీబుగ్గ పోలీసు స్టేషన్లలో ఐదు కేసులు నమోదై ఉన్నాయి. తిరుపతి మారుతీనగర్‌కు చెందిన హేమకర్‌పై కాణిపాకం స్టేషన్‌లోలో చీటింగ్ కేసు, బర్రి రవితేజ, మామిడి ఉమా మహేష్‌పై దాదాపు ఆరు కేసులున్నట్లు తెలిసింది.


వార్డు కార్యదర్శుల బదిలీలకు కౌన్సెలింగ్

నేటినుంచి చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహణ



కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల పరిధిలోని వార్డు కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ గురువారం విడుదల చేశారు. ఈ ప్రక్రియను ఈనెల 30వ తేదీలోపు పారదర్శకంగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. చిత్తూరు ఉమ్మడి జిల్లా పరిధిలోని తిరుపతి, చిత్తూరు నగరపాలక సంస్థలతోపాటు మదనపల్లె, శ్రీకాళహస్తి, పలమనేరు, పుంగనూరు, నగరి, పుత్తూరు, కుప్పం పురపాలక సంఘాల పరిధిలోని వార్డు కార్యదర్శుల బదిలీలకు సంబంధించి జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. వార్డు కార్యదర్శులకు శుక్ర, శని వారాల్లో నాగయ్య కళాక్షేత్రంలో బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి వార్డు అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ, వార్డు అమినిటీ సెక్రటరీ, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేటరీ సెక్రటరీలకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. శనివారం ఉదయం 10.30గంటల నుంచి వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు.



తిరుపతిలో నిర్వహిస్తున్న ర్యాలీ

డ్రగ్స్‌పై మౌనం వద్దు

మీకు తెలిసిన వాళ్లో.. స్నేహితులో డ్రగ్స్ తీసుకుంటున్నారా? డ్రగ్స్‌కు అలవాటు పడ్డ వాళ్లు.. ఇతర నేరాలకూ పాల్పడతారనేది గుర్తించండి. అలాంటి వారిని సన్మార్గంలో పెట్టాలంటే మీరు మౌనం వీడాలి. పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అలా ప్రజలకు అవగాహన కల్పిస్తూ గురువారం జిల్లా వ్యాప్తంగా యాంటీ డ్రగ్ ర్యాలీలు నిర్వహించారు.

8

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుచానూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గంలో పలువురికి ఎమ్మెల్యే పులివర్తి నాని గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. తనపల్లి రఘునాథ్ రిసార్ట్స్‌లోని టీడీపీ కార్యాలయంలో తిరుపతి, పాకాల, చంద్రగిరి, రామచంద్రాపురం మండలాలకు చెందిన పలువురికి రూ.39,02,291 చెక్కులను అందజేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం అండగా నిలుస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. బాధిత కుటుంబాల వారు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



రాజగోపాల్ నాయుడు కుచెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం బొల్లినేనివారిపల్లికి చెందిన రాజగోపాల్ నాయుడు కొంతకాలం క్రితం అనారోగ్యానికి గురయ్యారు. ఆర్థికంగా ఇబ్బందులు గురికావడంతో ఈ విషయాన్ని స్థానిక నాయకులు చంద్ర ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకెళ్లగా ఆయన సీఎం సహాయ నిధి నుంచి రూ.90 వేలు మంజూరు చేయించారు. దానికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే స్వగృహంలో గురువారం రాజగోపాల్ నాయుడుకు అందించారు. ఆయన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్, ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్, ఆర్‌వీ రమణారెడ్డి, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.



హర్షితకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నాని

ఎర్రావారిపాలెం: మండలంలోని ఉదయ మాణిక్యం పంచాయతీ నగరికి కెందిన దేశిరెడ్డి మురళి కుమార్తె దేశిరెడ్డి హర్షిత(20) ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చదువుతోంది. కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. సమస్యను టీడీపీ మండలాధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ ఎమ్మెల్యే నాని దృష్టికి తీసుకెళ్లాడు. స్పందించిన నాని వెంటనే సీఎం సహాయ నిధి నుంచి రూ.40వేలు మంజూరు చేయించారు. గురువారం పార్టీ కార్యాలయంలో హర్షితకు చెక్కు అందజేశారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ర్యాలీలో సచివాలయ, పంచాయతీ సిబ్బంది

తిరుచానూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని పంచాయతీ కార్యదర్శి మణి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుచానూరులో గురువారం సచివాలయ, పంచాయతీ సిబ్బందితో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. అవగాహనతోనే మాదక ద్రవ్యాల ముప్పును ఎదుర్కోవాలన్నారు. భావితరాలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన, మాదక ద్రవ్య రహిత భవిష్యత్తును అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

భక్తులకు ఆదివారాహి దేవి కటాక్షం





భక్తులకు అనుగ్రహభాషణం చేస్తున్న సిద్ధేశ్వరనంద భారతి - ప్రత్యేక అలంకారంలో శ్వేత వారాహిదేవి

రామచంద్రాపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకట్ట శ్రీశక్తిపీఠంలో వారాహి నవరాత్రుల్లో భాగంగా తొలి రోజు గురువారం శ్వేత వారాహిదేవి ఆదివారాహిదేవిగా భక్తులను కటాక్షించారు. మరకతశక్తి కాళీ అమ్మవారితో పాటు శ్వేత వారాహిదేవికి తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేశారు. గణపతి, కాళీ హోమాన్ని శాస్త్రోక్తంగా ప్రారంభించి 12గంటలకు పూర్ణాహుతితో ముగించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఊంజల్‌సేవ కన్నులపండువలా నిర్వహించారు. 500 మంది భక్తులు వారాహి దీక్షను తీసుకున్నారు. రాత్రి కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి వారాహదేవి వైభవం వినిపించి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ కార్యక్రమంలో పీఠం కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దు



డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రామచంద్రాపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆర్‌సీపురం పోలీసులు సూచించారు. గురువారం వివిధ పాఠశాలల విద్యార్థుల కు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మెరుగైన సమాజం కోసం డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని హెచ్‌సీ రాజశేఖర్ సూచించారు. అనంతరం గంగిరెడ్డిపల్లి నారాయణ కళాశాల, కమ్మకండ్రిగ, అనుపల్లి పాఠశాలల్లో డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు.

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రమేష్ కుమార్

పాకాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ కుమార్ కోరారు. కళాశాలలో గురువారం నషా ముక్త్ క్లబ్, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటయితే జీవితాలు నాశనమవుతాయన్నారు. స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ అరవింద్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నిలిచి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో మాశిలామణి, అధ్యాపకులు చిట్టికళావతి, ఈశ్వరబాబు. సీతారామిరెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి

నేడు ప్రపంచ ఎంఎస్ఎంఈ దినోత్సవం

తిరుచానూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు సమీపంలోని తాజ్‌హోటల్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రపంచ ఎంఎస్ఎంఈ(సూక్ష్మ, చిన్న, మధ్యతరహా) దినోత్సవం నిర్వహించనున్నారు. రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పరిశ్రమల ప్రతినిధులు పలువురు హాజరుకానున్నారు. దీనికి సంబంధించి పరిశ్రమల శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది.

క్వారీలో కార్మికుడి మృతి



మృతిచెందిన పొడియమి

చంద్రగిరి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దోర్నకంబాల పంచాయతీ మొండికాల్వ సమీపంలోని క్వారీలో ఓ కార్మికుడు కిందపడి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. ఛతీస్‌గఢ్‌కు చెందిన సాను పొడియమి(33) మండలంలోని మొండికాల్వ సమీపంలోని క్వారీలో పనిచేస్తున్నాడు. ఈనెల 23వ తేదీన క్వారీ గుట్టపై తాడు సహాయంతో కిందకు దిగుతుండగా కిందపడ్డాడు. తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 25వ తేదీన మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రహదారి దాటాలంటే కష్టాలే



రామానుజపల్లె సర్కిల్‌లో నిర్మిస్తున్న అండర్ పాస్

తిరుపతిరూరల్, జూన్26(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండల పరిధిలోని గ్రామీణ ప్రాంత ప్రజలు నగరంలోకి రావడానికి అవస్థలు పడుతున్నారు. పలు గ్రామాలు పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిని దాటుకుని అవతలివైపు ఉండడంతో నగరానికి చేరుకోవడానికి అండర్‌పాస్‌లు లేక ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు జాతీయ రహదారి విస్తరణ పనులు జరగుతుండడంతో ట్రాఫిక్ మరింతగా పెరుగుతుంది. గ్రామాల్లో నివాసముంటున్న ఉద్యోగులు, స్థానికులు ఉదయం కార్యాలయాలకు వెళ్లడం, విద్యార్థులను తీసుకురావడం, వ్యక్తిగత పనులపై నగరానికి చేరుకోవడంతో పాటు సాయంత్రం తిరిగి కార్యాలయాలు, విద్యాసంస్థల పనివేళలు ముగిసిన తర్వాత ఇళ్లకు చేరుకుంటారు. ఈ నేపథ్యంలో ఉదయం, సాయంత్ర సమయాల్లో ఈ రహదారిపై ఉన్న కూడలిలో విపరీతమైన వాహనాల రద్దీ ఏర్పడుతోంది. దీంతో స్థానిక పాదచారులు, వాహనదారులు భయం..భయంగా రహదారిని దాటుతున్న పరిస్థితి ఉంది. రామానుజపల్లె, వేదాంతపురం, తనపల్లె, సి.మల్లవరం, వకుళామాత ఆలయం సర్కిళ్ల వద్ద రహదారిని దాటుకుని పలు గ్రామాలకు వెళ్లేందుకు రోడ్డు మార్గాలు ఉన్నాయి. దీంతోపాటు రూరల్ మండలం మీదుగా ఆర్‌సీపురం, పచ్చికాపలం వరకూ ఉన్న పలు గ్రామాల ప్రజలు నగరానికి ఈ మార్గం ద్వారానే రాకపోకలు సాగిస్తుంటారు. ఒకట్రెండు

అండర్‌పాస్‌లు లేక అవస్థలు

సర్కిల్స్‌లో ట్రాఫిక్ పోలీసులు ఉండడంతో కొంతవరకు ట్రాఫిక్‌ని అదుపు చేస్తున్నారు. మరికొన్ని కూడళ్లలో వాహనదారులు, పాదాచారులు ఇష్టానుసారంగా, వేగంగా, అడ్డదిడ్డంగా రాకపోకలు సాగిస్తున్న పరిస్థితి ఉంది. ఇక జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మండల పరిధిలో ఎన్‌హెచ్ ఆధ్వర్యంలో గుర్తించిన హద్దుల వరకు రహదారికి ఇరువైపులా పనులు జోరుగా సాగుతున్నాయి. రామానుజపల్లె, మల్లవరం వద్ద అండర్‌పాస్ పనులు జరుగుతున్నాయి. కాగా రామానుజపల్లె కూడలిలో అండర్‌పాస్ నిర్మాణ పనుల్లో భాగంగా ట్రాఫిక్‌ని డైవర్షన్ చేశారు. కూడలిలో యూటర్న్ తీసుకునేందుకు ఎదురెదురుగా ప్రయాణించే వాహనాదారులకు ఏమార్గంగుండా వెళ్లాలో అర్థంకాకుండా గందరగోళానికి గురవుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు గానీ లేదా ఎన్‌హెచ్ సిబ్బంది గానీ ఉండి వాహనాదారులకు మార్గనిర్దేశం చేయాలని స్థానికులు కోరుతున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు రహదారిని దాటుకునే క్రమంలో సక్రమ మార్గంలో ప్రయాణించడంతోపాటు వేగాన్ని తగ్గించి వాహనాలను నడపాల్సిన అవసరముందని అంటున్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా పనిచేద్దాం



టవర్ క్లాక్ వద్ద ప్రమాణం చేస్తున్న ఎమ్మెల్యే నాని, విద్యార్థులు, అధికారులు

చంద్రగిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా పనిచేద్దామని ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చంద్రగిరిలో విద్యార్థులు, అధికారులతో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ముందు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం టవర్ క్లాక్ వద్ద విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నాయకులు కళాశాలల ముందు గంజాయి దుకాణాలు నడిపిన విషయం గుర్తు చేశారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని కూలదోసినట్లు చెప్పారు. పిల్లల ప్రవర్తనలో ఏవైనా మార్పులు కనిపిస్తే తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గ్రామీణ యువత మాదక ద్రవ్యాల బారినపడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎక్కడైనా గంజాయి ఆనవాళ్లు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం



చిన్నగొట్టిగల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు విద్యార్థులు

భాకరాపేట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యమని ఎంపీడీవో గిడ్డయ్య అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నగొట్టిగల్లులో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఆయన మాట్లాడుతూ గంజాయి, హెరాయిన్, కొకైన్ వంటి మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ అమ్మినా, కొన్నా చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాఘవేంద్ర, ఎంఈవో సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర్ రెడ్డి, డీటీ వాసుదేవ కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎర్రావారిపాలెంలో..



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ

మాదకద్రవ్యాల విని యోగాన్ని వ్యతిరేకిం చాలని మండల కేంద్రం లో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తలకోన రోడ్‌లో పోలీస్‌స్టేషన్ ఎదురుగా మానవహారంగా ఏర్పడ్డారు. ఈ ర్యాలీలో ఎండీఓ మదన్ మోహన్ రాజు, ఎస్ఐ బాలకృష్ణ, ఎంఈవోలు బాలసుబ్రమణ్యం-1, సతీష్‌బాబు-2 తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



కోయిల్ ఆళ్వార్ తిరుమంజనంకు సుగంధ ద్రవ్యాలను తీసుకొస్తున్న ఆలయ అర్చకులు, అధికారులు

చంద్రగిరి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగా పురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 30 నుంచి జూలై 2వ తేదీ వరకు జరగనున్న సాక్షాత్కార వైభవోత్సవాలను పురస్కరించుకుని గురువారం వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఉదయం 7 నుంచి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు.

హథీరాంజీ మఠం భూముల వేలంలో గందరగోళం



చంద్రగిరి ఎంపీడీవో కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్న దృశం

చంద్రగిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన హథీరాంజీ మఠం భూముల కౌలు వేలం పాటలో గందరగోళం జరిగింది. మండలంలోని పిచ్చినాయుడు, దోర్నకంబాల, చంద్రగిరి పంచాయతీలకు సంబంధించిన భూములకు హథీరాంజీ మఠం ఏవో బాపిరెడ్డి ఆధ్వర్యంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ పణిరాజశయన్ పర్యవేక్షణలో కౌలు వేలం నిర్వహించారు. ఒకేచోట వేలం పాట పెట్టడం, రైతులు ఎక్కువమంది రావడంతో గందరగోళం నెలకొంది. పోలీసుల సహాయంతో గొడవను సద్దుమణిగించారు. మఠం సూపరింటెండెంట్ కేశవులు మాట్లాడుతూ గతంలో తిరుపతి ప్రధాన కార్యాలయం వద్ద వేలం పాట నిర్వహించే వాళ్లమని, రైతుల సౌకర్యార్థం ఆయా గ్రామాల్లోనే పెడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మఠం సిబ్బంది సీతారామయ్య, మునివెంకటేష్, కిరణ్ పాల్గొన్నారు.

మహిళా సర్పంచ్‌లకు శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న ఎంపీడీవో రామచంద్ర

తిరుపతి రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండల ఎంపీడీవో సమావేశ మందిరంలో డివిజన్ స్థాయిలో మహిళా సర్పంచ్‌లకు సెకండ్ ఫేజ్ శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. వడమాలపేట, ఆర్సీపురం, ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు, పాకాల మండల్లాకు చెందిన సర్పంచ్‌లు హాజరయ్యారు. ఎంపీడీవో రామచంద్ర మాట్లాడుతూ.. గ్రామాల్లో సుపరిపాలన అందించి పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని, సాధికారతతో స్వపరిపాలన సాధ్యమవుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు అందించే నిధులు, కొత్తవనరుల సృష్టి, పన్నుల ద్వారా అభివృద్ధి చేసుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

కార్పొరేట్ కళాశాలకు దీటుగా ఫలితాలు



చంద్రగిరి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కార్పొ రేటు కళాశాలలకు దీటుగా చంద్రగిరి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు అత్యుత్త మ ఫలితాలు సాధిస్తోందని ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థునులకు మండలంలోని పీఎల్‌ఆర్ క్యాండీ హోటల్ అధినేత లక్ష్మీనాథ్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది సహకారంతో గురువారం ప్రోత్సాహక బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు టెక్స్ట్‌బుక్స్, నోట్ బుక్స్, బైపీసీ విద్యార్థులకు రికార్డులు సైతం అందిస్తుందన్నారు. మధ్యాహ్న భోజనం పథకంలో సన్న బియ్యం వినియోగిస్తున్నట్లు తెలిపారు. కళాశాలకు చెందిన విద్యార్థిని పి.అపర్ణ అమరావతి విట్ కళాశాలలో ఉచితంగా సీటు పొందినట్లు పేర్కొన్నారు.

వేమూరుని సందర్శించిన తమిళనాడు రైతులు



వేమూరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న తమిళనాడు రైతులు

తిరుపతి రూరల్, జూన్26 (ఆంధ్రజ్యోతి): తిరు పతి రూరల్ మండలం వేమూరు గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను తమిళనాడు రాష్ట్రంలోని అరియలూర్ జిల్లాకు చెందిన పలువురు రైతులు గురువారం సందర్శించారు. ఆత్మ ఇంటర్‌స్టేట్ ఎక్స్‌పోజర్ విజిట్‌లో భాగంగా వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి.. ఆదర్శ రైతు అయ్యప్పనాయుడు అవలంబిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ విధానాన్ని తెలుసుకున్నారు. అలాగే మల్బరి తోటల పెంపకం, పట్టుపరిశ్రమ, బీఆర్‌సీసెంటర్, మామిడి, ఏటీఎం మోడల్, ఏగ్రేడ్ మోడల్, పీఎండీఎస్ పంటలను సందర్శించి ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలను క్షుణంగా తెలుసుకున్నారు. డీపీఎం షణ్ముగం, శాస్త్రవేత్త ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

తడి, పొడిచెత్త వేర్వేరుగా ఇవ్వండి



తిరుపతి రూరల్, జూన్26 (ఆంధ్రజ్యోతి): తడి, పొడిచెత్తలను కలిపి ఇవ్వకుండా వేర్వేరుగా అందించాలని డిప్యూటీ ఎంపీడీవో దయాసాగర్ పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం చిగురువాడ పంచాయతీలో చెత్తసేకరణపై నిర్వహించే అవగాహనా కార్యక్రమాన్ని గురువారం ఆయన సందర్శించి పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి ఎం.లక్ష్మీదేవితో కలసి ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ చెత్త, వ్యర్థాలు పడేయకూడదని, ఇంటికి వచ్చే చెత్తసేకరణ సిబ్బందికి అందించాలని సూచించారు. గ్రీన్‌అంబాసిడర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైమరీ మోడల్ స్కూల్‌తో ప్రాథమిక విద్య బలోపేతం



విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న గౌరీశంకర్

ఎర్రావారిపాలెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రైమరీ మోడల్ స్కూల్స్ వ్యవస్థతో ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని జిల్లా ఏపీసీ గౌరిశంకర్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని కేజీబీవీ, మోడల్ ఉన్నత పాఠశాల, నెరబైలు ప్రైమరీ మోడల్ స్కూల్ బోధన, అభ్యసన తీరును పరిశీలించారు. నెరబైలు పాఠశాలలో పిల్లల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు చురుగ్గా సమాధానం చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాలు, షూ, బ్యాగుల నాణ్యత గురించి ఆరా తీశారు. మోడల్ స్కూల్స్‌ను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల హాస్టల్‌లో వంటల ఇన్‌చార్జి, వంట మనిషి మధ్య వివాదంపై విచారణ జరిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో శివశంకరయ్య, జీసీడీవో పుష్పలత, ఎంఈవో బాలసుబ్రమణ్యం, ప్రిన్సిపాళ్లు పరిమళ, సరళ హెడ్ మాస్టర్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటివద్దకే రేషన్ పంపిణీ



అవిలాలలో వృధురాలికి ఇంటివద్దకే వచ్చి రేషన్ బియ్యం అందిస్తున్న డీలర్

తిరుపతిరూరల్, జూన్26(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలోని పంచాయతీల్లో 65ఏళ్ల పైబడిన వృద్ధులకు, వికలాంగులకు జూలైకు సంబంధించిన రేషన్ కోటాను గురువారం నుంచి ఈ నెల 30వరకూ ఇంటివద్దకే వచ్చి అందించేలా చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా పలు పంచాయతీల్లో వృద్ధులు, వికలాంగులకు బయోమెట్రిక్ ధ్రువీకరణ ద్వారా ఇంటివద్దనే రేషన్ పంపిణీ చేస్తున్నారు. ఆ ఫొటోలను గ్రూపులో షేర్ చేయాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని రూరల్ తహసీల్దార్ రామాంజులనాయక్ పేర్కొన్నారు.

గుడుపల్లె మండలంలో

వరుస చోరీలు

- ద్రావిడ వీసీ, ఏపీఆర్వో, ఉపాధ్యాయులు బాధితులు
- పట్టపగలే భారీగా బంగారు, వెండి, నగదు అపహరణ



గుండ్లసాగరం వద్ద నరేష్ ఇంట్లో చెల్లాచెదురుగా పడేసిన దుస్తులు

కుప్పం/గుడుపల్లె 26 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండలంలో గురువారం పట్టపగలే జరిగిన వరుస చోరీలలో బంగారు, వెండి, నగదు భారీగా అపహరణకు గురైంది. మండలంలోని గుండ్ల సాగరం శివార్లలో ద్రావిడ విశ్వవిద్యాలయం ఏపీఆర్వో ఇంట్లోని పైభాగంలో వర్సిటీ ఇన్‌చార్జి వీసీ దొరస్వామి ఒంటరిగా అద్దెకు ఉన్నారు. కింది పోర్షన్లో ఏపీఆర్వో నరేష్ కుటుంబం ఉంది. ఈయన భార్య కూడా వర్సిటీలోనే అకడమిక్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నారు. సాయంత్రం దంపతులు ఇద్దరూ విధులు ముగించుకుని ఇంటికి వచ్చేసరికి తలుపులకు వేసిన తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరచి, అందులోని దుస్తులు, ఇతర వస్తువులు చెల్లాచెదురుగా కనిపించాయి. బీరువా లాకర్లో దాచి ఉంచిన 220 గ్రాముల బంగారు ఆభరణాలు, 2కిలోల వెండి వస్తువులు, రూ.15వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితులు తెలిపారు. పైపోర్షన్లో నివాసముంటున్న ఇన్‌చార్జి వీసీ దొరస్వామి ఇంట్లోనూ ఇదే రకంగా చోరీ జరిగింది. బీరువాలో దాచిన రూ.2లక్షల నగదు అపహరణకు గురైనట్లు స్థానికులు తెలిపారు. మరోవైపు శెట్టిపల్లె పంచాయతీ పరిధిలోని పీఏఎస్ వైద్య కళాశాల సమీపంలో నివాసముంటున్న ఉపాధ్యాయుడు రమేష్ ఇంట్లో కూడా 1.5 కిలోల వెండి, రూ.48వేల నగదు చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. ఉపాధ్యాయులైన భార్యాభర్తలు పాఠశాలల నుంచి సాయంత్రం ఇంటికి తిరిగివచ్చేసరికి దొంగలుపడి వెండి, నగదు దోచుకుని వెళ్లారు. గుడుపల్లె పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నారు.

'బృందావనం' నుంచి మురుగునీరు



రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

తిరుపతి అర్బన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పేరుకే బృందావనం అపార్టుమెంటు. దాని నుంచి వెలువడే మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. కరకంబాడీ రోడ్డు నుంచి కాటన్‌మిల్లు వరకు ఏర్పాటు చేసిన మాస్టర్‌ప్లాన్ రోడ్డు(గోదాదేవిమార్గం)లో బృందావనం పేరుతో భారీ భవన సముదాయముంది. అయితే ఈ అపార్టుమెంటుకు సంబంధించిన డ్రైనేజీ సిస్టమ్ పాడవడంతో మురుగునీరు ప్రహరీ వెలుపల రహదారిపై వదిలేశారు. దీంతో కొన్ని రోజులుగా రోడ్డుపై ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఆ దారిన రాకపోకలు సాగిస్తున్న బడి పిల్లలు, వాహనదారులు, పాదచారులు ముక్కులు మూసుకోవాల్సి వస్తోంది. నగరపాలక అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

కార్పొరేట్ పాఠశాలల దోపిడీని అరికట్టండి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నారాయణగౌడ్

తిరుపతి(విద్య), జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలని బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నారాయణగౌడ్ కోరారు. ఈ మేరకు గురువారం డీఈవో కేవీఎన్ కుమార్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. నారాయణగౌడ్ మాట్లాడుతూ సీబీఎస్ఈ, ఈ టెక్నో, ఒలంపియాడ్ తదితర పేర్లతో ఆయా పాఠశాలల యాజమాన్యాలు యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నాయని తెలిపారు. దీనికి అడ్డుకట్ట వేయాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్దిదారులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం సాయంత్రం అందజేశారు. కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన జ్యోతి అనారోగ్యంతో చికిత్స చేయించుకోగా రూ.1.76లక్షల చెక్కును ఆమె కుమారుడికి అందజేశారు. 3వ డివిజన్‌లోని గరుడాద్రినగర్‌కు చెందిన హరినాథ్ ఆచారికి రూ. 41వేలు, 17వ డివిజన్ పరిధిలోని కొత్తఇండ్లకు చెందిన కె.చెంగల్‌రాయులుకు రూ.1.72లక్షలు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర కార్యదర్శి మహేష్‌యాదవ్, జనసేన నాయకులు సుధాకర్, భాను, వీర పాల్గొన్నారు.

జేఈఈ, నీట్ టాపర్లకు కలెక్టర్ అభినందనలు



కలెక్టర్ వెంకటేశ్వర్‌తో నారాయణ విద్యార్థులు

తిరుపతి(విద్య), జూన్ 26(ఆంధ్రజ్యోతి): జేఈఈ, నీట్‌లో జిల్లా, జోనల్ స్థాయిలో టాపర్లుగా నిలిచిన తిరుపతి నారాయణ విద్యాసంస్థల విద్యార్థులను కలెక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు. జేఈఈ టాపర్లు భానుచరణ్‌రెడ్డి (51), మణిదీప్‌రెడ్డి (345), హిమేష్ రాఘవ (468), శశాంక్‌రెడ్డి (618), యశ్విత (906), నిఖిల్ (1056), నీట్ టాపర్లు జ్ఞానేష్ (934), మోనిక, కీర్తి, విశ్వక్ అగర్వాల్‌తో కలిసి ఆ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు గురువారం కలెక్టర్‌ను కలిశారు. మంచి మార్కులు సాధించి జిల్లాకు గుర్తింపు తెచ్చారంటూ విద్యార్థులను కలెక్టర్ ప్రశంసించారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకుని జిల్లాకు సేవలు అందించాలని సూచించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో విద్యార్థుల తల్లిదండ్రులు, నారాయణ విద్యాసంస్థల డీన్లు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ఉన్నారు.

ఈగల్ టీమ్ ఏర్పాటుపై హర్షం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు అరికట్టడానికి కూటమి ప్రభుత్వం ఈగల్ టీమ్ ఏర్పాటు చేయడం హర్షణీయమని టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు కొట్టే హేమంత్‌రాయల్ పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయాలను పెంచి పోషించిందని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తే అక్రమ కేసులు బనాయించిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాగానే డ్రగ్స్ నివారణకు చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సెకండ్ క్లాస్ స్లీపర్ కోచ్‌లు పెంచండి

తిరుపతి(సెంట్రల్), జూన్26(ఆంధ్రజ్యోతి): తిరుపతి-కదిరిదేవరపల్లి స్టేషన్ల మధ్య నడుస్తున్న ఫాస్ట్ ప్యాసింజర్ రైలుకు సెకండ్ క్లాస్ స్లీపర్ కోచ్‌లు పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ రైలు(57405)లో సామర్థ్యం కంటే ఎక్కువ మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారని తెలిపారు. ఐదేళ్ల క్రితం మధ్య తరగతి ప్రయాణికుల సౌలభ్యం కోసం రెండు సెకండ్ క్లాస్ స్లీపర్ కోచ్‌లు ఏర్పాటు చేశారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు వెయిటింగ్ లిస్ట్‌తో చార్ట్ ముగుస్తోందని వివరించారు. ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు ప్రయాణికులు, గుంతకల్లు రైల్వే డివిజన్ రైల్వే ఉద్యోగులకు ఈ రైలు అనుకూలంగా ఉందని, వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనంగా సెకండ్ క్లాస్ స్లీపర్ కోచ్‌లను ఏర్పాటు చేయాల్సిన అవసరముందని తెలిపారు. ఆ మేరకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నామినేషన్ వేయని ఎంప్లాయీస్ సంఘ్

తిరుపతి(సెంట్రల్), జూన్26 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకమండలి ఎన్నికల్లో నామినేషన్లకు గురువారం చివరి రోజైనా ఎంప్లాయీస్ సంఘ్ నుంచి ఒకరు కూడా దాఖలు చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. మూడు రోజులుగా నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. మొదటి రోజు నుంచి మజ్దూర్ యూనియన్‌కు చెందిన ఉద్యోగ, కార్మికులు ఉత్సాహంగా 18 నామినేషన్లు వేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన ఉంటుంది. శని, ఆదివారాల్లో ఉపసంహరణ ఉంటుంది. సోమవారం బరిలో ఉన్న అభ్యర్థుల జాబితా విడుదల చేస్తారు. ఇతర కార్మిక, ఉద్యోగ సంఘాల వారు నామినేషన్లు వేయకపోవడంతో ఉపసంహరణ అనంతరం మజ్దూర్ యూనియన్ అభ్యర్థులు గెలిచినట్లు ఎన్నికల అధికారి ప్రకటించే అవకాశముంది.

గోవిందరాజస్వామి ఆలయంలో పెరియాళ్వార్ ఉత్సవం ప్రారంభం

తిరుపతి అర్బన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయ అనుబంధ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో పెరియాళ్వార్ ఉత్సవం గురువారం ప్రారంభమైంది. ఉదయం, సాయంత్రం పెద్ద, చిన్నజియ్యర్ స్వాములు కలసి పెరియాళ్వార్ సన్నిధిలో ప్రబంధ పాశురాలను నివేదించారు. పది రోజులు ఈ ఉత్సవం కొనసాగనుంది. చివరి రోజు జూలై 5న ఉదయం పెరియాళ్వార్‌కు తిరుమంజనం చేస్తారు. సాయంత్రం గోవిందరాజస్వామి గరుడ వాహనంపై, పెరియాళ్వార్ గజవాహనంపై తిరువీధుల్లో విహరిస్తారు.

నేటి నుంచి జాతీయ సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం (ఆర్ఏఆర్ఎస్)లో జాతీయ సదస్సు చేపట్టనున్నారు. వ్యవసాయ రంగంలో సవాళ్లు - వాతావరణ అనుకూలిత నూతన ఆవిష్కరణలు అంశంపై రెండు రోజుల పాటు ఈ సదస్సు నిర్వహించనున్నారు. ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ-ఇండియన్ సొసైటీ ఆఫ్ అగ్రానమీ సంయుక్తంగా దీనిని చేపట్టాయి. ఇందులో వ్యవసాయ వర్సిటీ వీసీ శారదాజయలక్ష్మీ, బెంగళూరు వ్యవసాయ వర్సిటీ మాజీ డైరెక్టర్ శంకర్, పలు ప్రాంతాల ప్రతినిధులు పాల్గొంటారు.

అందరి సహకారంతోనే డ్రగ్స్ నివారణ

విద్యార్థుల అవగాహన సదస్సులో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు





సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు - హాజరైన ఎస్వీ వైద్య కళాశాల విద్యార్థులు

తిరుపతి(వైద్యం), జూన్ 26(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలను ఏ రూపంలో తీసుకున్నా జీవితాలను నాశనం చేస్తాయని, వీటి నిర్మూలనకు అందరి సహకారం అవసరమని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రుయాస్పత్రిలోని మానసిక విభాగం, మత్తు వ్యసన నిర్మూలన కేంద్రం ఆధ్వర్యంలో ఎస్వీ వైద్య కళాశాలలోని భువన విజయం ఆడిటోరియంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డ్రగ్స్ అనేది జాతీయ సమస్యగా మారిందన్నారు. మొదట సరదా కోసం తీసుకుని తర్వాత వాటికి బానిసలుగా మారుతున్నారు. తద్వారా భవిష్యత్తు నాశనమవుతుందని తెలిపారు. ఈగల్ టీంను స్థాపించి 24 గంటలు ప్రత్యేక నిఘా ఉంచి డ్రగ్స్ నివారణకు కృషి చేస్తున్నామన్నారు. మందుల దుకాణదారులు డాక్టర్ రశీదు లేకుండా మత్తుకు సంబంధించిన మెడిసిన్స్ ఇవ్వకూడదని, ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభ మాట్లాడుతూ రుయాస్పత్రి మానసిక విభాగం ఆధ్వర్యంలో మత్తు వ్యసన నిర్మూలన కేంద్రం అందుబాటులో ఉందని, అక్కడ కౌన్సెలింగ్, చికిత్స పద్ధతిలో చెడు వ్యసనాల నుంచి దూరం చేస్తారని అన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్ఫలితాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రుయా సూపరింటెండెంట్ రాధా, డీఎస్పీలు శ్రీలత, రామకృష్ణ, సీఐలు ప్రసాద్, తమీమ్ అహ్మద్, మానసిక విభాగాధిపతి మల్లికార్జున్, డాక్టర్లు కవిత, జాహ్నవి, వైద్య, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

10 ఎర్రచందనం దుంగల స్వాధీనం

మంగళం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి రేంజ్ అటవీ శాఖ అధికారులు పెట్రోలింగ్ నిర్వహించి 10 ఎర్రచందనం దుంగలతోపాటు ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లింగ్ జరుగుతోందని తిరుపతి రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డికి అందిన రహస్య సమాచారం మేరకు సిబ్బంది బుధవారం రాత్రి 9గంటల సమయంలో రేణిగుంట నుంచి మామండూరు వైపుగా పెట్రోలింగ్ చేపట్టారు. గురువారం తెల్లవారుజామున ఆంజనేయపురం వద్ద ఏపీ04ఏయూ 7434 నెంబరు కారు అతివేగంగా రావడాన్ని అటవీశాఖ అధికారులు గమనించారు. ఆపే ప్రయత్నం చేయగా డ్రైవర్ కొంతదూరం వెళ్లి వాహనాన్ని వదలి పారిపోయాడు. అధికారులు వాహనాన్ని తనిఖీ చేయగా 10 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గమనించారు. వాహనంతో సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. 294 కేజీలు ఉంటాయని వాహనంతో సహా ఎర్రచందనం విలువ రూ.6.5లక్షలు ఉంటుందని రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఎస్‌వో చైతన్య, ఎఫ్‌బీవో వెంకటేశ్వరరావు, ప్రొటెక్షన్ వాచర్లు సిసింద్రీ, వెంకటేష్, ప్రసాద్, నవీన్, రవి పాల్గొన్నారు.



పట్టుబడ్డ ఎర్రచందనాన్ని చూపుతున్న అటవీ శాఖ అధికారులు

మనుషుల మధ్య అంతరాలను తొలిగించేది కళే

- ప్రముఖ ట్రాన్స్ ఉమెన్ డాక్టర్ సాన్వి జెత్వాని - ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మనుషులందరినీ ఏకం చేసేది కళేనని మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన ప్రముఖ ట్రాన్స్ ఉమెన్ డాక్టర్ సాన్వి జెత్వాని పేర్కొన్నారు. జెండర్ ఈక్వాలిటీ అంశంపై పద్మావతి మహిళా యూనివర్సిటీ సంగీత, నృత్య విభాగంలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని తన నృత్య ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం డాక్టర్ సాన్వి జెత్వాని మాట్లాడుతూ నృత్యకారిణిగా తన జీవిత ప్రయాణంలో ఎన్నో అనుభవాలు ఉన్నాయని తెలిపారు. మేనేజ్‌మెంట్ సైన్స్, ఫోక్ డ్యాన్స్‌లో రెండు పీహెచ్‌డీలు సాధించినట్లు చెప్పారు. దేశ, విదేశీ సంస్థల నుంచీ కళలు, సామాజిక సేవా రంగాల్లో కృషికి అవార్డులు స్వీకరించానని అన్నారు. ప్రత్యేకించి ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమం కోసం పనిచేయడం తనకు చాలా సంతోషాన్ని ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ శైల్వేశ్వరి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ హిమబిందు, విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న సాన్వి జెత్వాని

నేటి నుంచి ధర్మరాజస్వామి ఆలయ ఉత్సవాలు





పనులను పరిశీలిస్తున్నఈవో బాపిరెడి - ఆలయ ధ్వజస్తంభాన్ని ముస్తాబు చేస్తున్న కార్మికుడు

శ్రీకాళహస్తి. జూన్ 26(ఆంధ్రజ్యోతి): ధర్మరాజస్వామి ఉత్సవాలు పట్టణంలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా చెన్నైరోడ్డులోని ధర్మరాజస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి జూలై 9 వరకు జరుగుతాయి. శుక్రవారం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 28న పాండవ విద్యాభ్యాసం, 29న హిడింబాసుర, బకాసుర వధ, 30న మత్స్యయంత్ర ఛేదనం, జూలై 1 ద్రౌపది కల్యాణం, 2న రాజసూయ యాగం, 3న ద్రౌపది వస్త్రాపహరణం ఇలా వరుసగా వివిధ కార్యక్రమాలు జరుగుతాయి. వారం రోజుల ముందు నుంచే ఆలయ పరిసరాలను అధికారులు సుందరంగా ముస్తాబు చేశారు. గురువారం నుంచి విద్యుద్దీపాలంకరణ చేశారు. ఈవో బాపిరెడ్డి క్యూలైన్ల ఏర్పాటు, అగ్నిగుండ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మేథో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. వినాయక పూజల కలశ పూజ వైదిక క్రతువులు ముగిశాక స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

సింహ వాహనంపై పరాశరేశ్వరుడు



నారాయణవనం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ ఆలయం చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి యోగాసన మూర్తి అవతారంలో సింహవాహనంపై ఊరేగించారు. ప్రత్యేక అభిషేకాలు పూర్తయ్యాక స్వామివారితో సహా అమ్మవారిని ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. సాయంత్రం సింహ వాహనంపై ఊరేగిన చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామికి భక్తులు నారికేళా, కర్పూర నీరాజనాలతో దర్శించుకున్నారు. కార్యక్రమంలో సూపరిటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు డీఈవో అభినందన



రేణిగుంట, జూన్ 26, (ఆంధ్రజ్యోతి) : కరకంబాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నీలకంఠయ్య జాతీయ వినూత్న విద్యారత్న అవార్డు పొందారు. నవాచారిగతి విద్యా గ్రూప్ ఇండియా చతీస్గడ్ బృందం ఆధ్వర్యంలో బుధవారం చత్తీస్‌గడ్‌లో నిర్వహించిన నేషనల్ ఇన్నోవేటివ్ ఎడ్యుకేషన్ రత్న ఎడ్యుకేషన్ కాన్‌క్లేవ్‌లో ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. నీలకంఠయ్యను గురువారం డీఈవో కుమార్ సత్కరించారు.

బాలిక పట్ల అసభ్య ప్రవర్తన

ఒకరిపై కేసు నమోదు

రేణిగుంట, జూన్ 26, (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఆయన కథనం మేరకు తిరుపతికి చెందిన బ్యాంకు ఉద్యోగి కుటుంబం ఎల్లమండ్యం జాతరలో పాల్గొనేందుకు బుధవారం జాతరలో అమ్మవారిని దర్శించునేందుకు వచ్చారు. స్థానికంగా ఉన్న రాజు అనే యువకుడు మద్యం మత్తులో ఆ కుటుంబానికి మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. గురువారం బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడు రాజుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.



తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద గురువారం మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

టీటీడీ ఉద్యోగులకు హెల్మెట్లు



ఉద్యోగులకు హెల్మెట్లు అందజేస్తున్న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, జూన్26(ఆంధ్రజ్యోతి): రెండువేల మంది టీటీడీ ఉద్యోగులకు గురువారం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు హెల్మెట్లను పంపిణీ చేశారు. తిరుమలలోని ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో వీటిని అందజేశారు. అమలాపురానికి చెందిన నిమ్మకాయల సత్యనారాయణ, హైదరాబాద్‌కు చెందిన నాగేంద్రప్రసాద్ అనే దాతలు వీటిని విరాళంగా ఇచ్చారు. రాబోవు రోజుల్లో మరో 7,500 హెల్మెట్లు అందజేస్తామన్నారు. టీటీడీ ఉద్యోగులందరూ విధిగా హెల్మెట్లు ధరించాలని కోరారు. హెల్మెట్లు ధరించడంపై అలిపిరి, ఘాట్‌రోడ్ల వద్ద ఎప్పటికప్పుడు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని సీవీఎస్వో మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీఈవో రాజేంద్ర, వీఎస్వో సదాలక్ష్మి, అన్నప్రసాదం స్పెషల్ ఆఫీసర్ శాస్త్రి పాల్గొన్నారు.

ధార్మిక గుణం అలవరచుకోవాలి



నూతన బస్సును ప్రారంభిస్తున్న కంచి కామకోటి పీఠాధిపతి

రామచంద్రాపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ధార్మిక గుణం అలవరచుకుంటే సమాజం బాగుంటుందని కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి అన్నారు. మండలంలోని మిట్టకండ్రిగ ప్రాణయోగ ఆశ్రమంలో విజయోత్సవ యాత్రలో భాగంగా ఆయన గురువారం వివిధ కార్యక్రమాలు చేపట్టారు. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎండీ సుందరరాజన్ అందించిన రెండు బస్సులకు సంబంధించిన తాళాలను విజయేంద్ర సరస్వతికి అందజేశారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులను ఆశీర్వదించారు. ప్రాణయోగ ఆశ్రమం పీఠాధిపతి కైలాస్‌గురు పాల్గొన్నారు.

నందలూరు, తాళ్లపాకల్లో బ్రహ్మోత్సవాలు

తిరుమల, జూన్26(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలోని నందలూరు సౌమ్యనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు, తాళ్లపాకలోని చెన్నకేశవస్వామి, సిద్ధేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్లను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి గురువారం ఆవిష్కరించారు. జూలై4 నుంచి 13వ తేదీ వరకు నందలూరులో, జూలై 5 నుంచి 15వ తేదీ వరకు తాళ్లపాకలో బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు నటేష్, ప్రశాంతి పాల్గొన్నారు.





ఆలయం ముందు రఘు - బండ్ల గణేష్

ప్రసాదాలు బావున్నాయి

● ప్లీజ్.. ఇలానే కంటిన్యూ చేయండన్న నటుడు రఘు

తిరుమల, జూన్26(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు టీటీడీ అందిస్తున్న సౌకర్యాలు బావున్నాయని సినీనటుడు రఘు సంతృప్తి వ్యక్తం చేశారు. తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, తిరుమలలో గతానికి ఇప్పటికి చాలా మార్పులు వచ్చాయన్నారు. అనేక చోట్ల కియోస్క్ యంత్రాలు ఏర్పాటు చేసి సేవలు అందించడం బావుందన్నారు. 'ప్రసాదాల రుచి బావుంది.. ప్లీజ్ .. ఇలానే కంటిన్యూ చేయండి' అని అన్నారు. అలాగే 'కోర్టు' సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైన శ్రీదేవి, నిర్మాత బండ్ల గణేష్ కూడా గురువారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఇంకా ఉత్తరాఖండ్ మాజీ సీఎం త్రివేంద్ర సింగ్ రావత్, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, మాధవి రెడ్డి, పులివర్తి నాని కూడా గురువారం స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు.

హైదరాబాదు- కన్యాకుమారి మధ్య 8 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), జూన్26(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని హైదరాబాదు-కన్యాకుమారి మధ్య తిరువణ్ణామలై మీదుగా 8 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరువణ్ణామలై పుణ్యక్షేత్రానికి పెరుగుతున్న రద్దీని తెలుసుకొని వీటిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జూలై 2 నుంచి 25వ తేది వరకు రాక పోకలు సాగిస్తాయన్నారు. హైదరాబాదులో ఈ ప్రత్యేక రైలు(07230) జూలై 2న (బుధవారం) సాయంత్రం 5.20 గంటలకు బయలుదేరి సికింద్రాబాదు, నల్లగొండ, నడికుడి, గుంటూరు, గూడూరు, రేణిగుంట, తిరుపతి, పాకాల, చిత్తూరు, కాట్పాడి, తిరువణ్ణామలై మీదుగా కన్యాకుమారికి 3వ తేది అర్ధరాత్రి దాటాక 2.30 గంటలకు చేరుకొంటుందని తెలిపారు. 4వ తేది (శుక్రవారం) ఉదయం 5.15 గంటలకు ఈ ప్రత్యేక రైలు(07229) బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ 5వ తేది మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాదు చేరుకొంటుందన్నారు.


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 30 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.67 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,001

తలనీలాలు సమర్పించినవారు: 23,765



దృష్టి సారిస్తే ఈ తీరాలు మణిహారాలు

● సహజ అందాలకు నెలవు గుమ్మళ్లదిబ్బ, తీగపాళెం బీచ్‌లు

ఎగసిపడే అలలు.. లయబద్ధంగా వినిపించే తరంగాల హోరు.. విశాలంగా పరచుకున్న ఇసుక తిన్నెలు.. నీలాకాశ అంచుల్ని ముద్దాడుతున్నట్లు కనిపించే సముద్రం సందర్శకులను కట్టిపడేస్తాయి. మనసు దోచుకునే ఈ ప్రకృతి రమణీయ తీరాలు చేరువలోనే ఉన్నాయి. అయితే ఆలనాపాలనా లేక ఆదరణకు దూరమవుతున్నాయి. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ప్రముఖ బీచ్‌ల సరసన చేరే సత్తా ఈ సుమనోహర తీరాలకుంది.

- గూడూరు, (ఆంధ్రజ్యోతి)

ఈ బీచ్‌లకు ఎలా వెళ్లాలంటే....

గూడూరు నుంచి గుమ్మళ్లదిబ్బకు 38 కిలోమీటర్లు దూరం. ఆర్టీసీబస్సు సౌకర్యం ఉంది. గ్రామం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో బీచ్ ఉంటుంది. నెల్లూరు నుంచి ముత్తుకూరు మీదుగా పోర్టురోడ్డు గుండా సుమారు 48 కిలోమీటర్లు ఉంటుంది. కోట నుంచి సుమారు 30 కిలోమీటర్లలోపే దూరం ఉంటుంది. నెల్లూరు, గూడూరు, కోట ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యముంది. తీగపాళెం బీచ్‌కు వెళ్లాలంటే లింగవరం నుంచి లేదా, గుమ్మళదిబ్బ నుంచి వెళ్లాలి. అయితే రెండు కిలోమీటర్ల మేర గ్రావెల్‌రోడ్డులో వెళ్లాలి. తారు రోడ్డు సౌకర్యం లేక చాలామంది వెనుకడుగేస్తున్నారు.

పర్యాటకాభివృద్ధితో ఉపాధికి ఊతం

ఇక్కడి బీచ్‌లను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే స్థానిక మత్స్యకారులకు జీవనోపాధి మెరుగుపడుతుంది. వివిధ రూపాల్లో ఇతరులకూ ఉపాధి కలుగుతుంది. రాష్ట్రానికి కొంత ఆదాయమూ సమకూరుతుంది. క్రిస్‌సిటీ నేపథ్యంలో ఇక్కడి బీచ్‌లపై పర్యాటకశాఖ ఫోకస్ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.



తీగపాళెం తీరంలో సందర్శకుల సందడి



తీగపాళెం బీచ్‌కు ఈ ఇరుకుదారే ఆధారం



తీగపాళెంలో పర్యాటకాభివృద్ధిపై పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్‌ఫొటో)



గుమ్మళ్లదిబ్బ తీరంలో సోయగాలు

సహజ సౌందర్యానికి కేరాఫ్‌గా నిలుస్తాయి చిల్లకూరు మండలం గుమ్మళ్లదిబ్బ, తీగపాళెం గ్రామాల బీచ్‌లు. ఫోకస్ లేక వీటి ఉనికి అంతంతమాత్రమైంది. సాధారణంగా సాగర తీరం అభివృద్ధి చేస్తే పర్యాటకం గానే కాదు.. ఎన్నో అంశాలనూ ఇది ప్రభావితం చేస్తుంది. గుజరాత్ తీరం ఆధారంగానే అభివృద్ధి సాధించింది. పాండిచ్చేరి, చెన్నై, గోవా, కేరళలోనూ బీచ్‌లను పర్యాటకంగా తీర్చిదిద్దుతున్నారు. గుమ్మళ్ల దిబ్బ, తీగపాళెం బీచ్‌లను కూడా ఇదే తరహాలో అభివృద్ధి చేస్తే సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటాయి.



గుమ్మళ్లదిబ్బ తీరప్రాంతంలో ఆలీవ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణ కేంద్రం

పరిశీలనే తప్ప పురోగతి ఏది?

గుమ్మళ్లదిబ్బ బీచ్‌లో ఆలీవ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణా కేంద్రముంది. కృష్ణపట్నం పోర్టు నుంచి ఇక్కడికి ఆరు కిలోమీటర్ల దూరం. తీగపాళెం బీచ్ 9 కిలోమీటర్ల దూరం. సమీపాన తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వస్తుంటారు. తూర్పుకనుపూరు నుంచి ఈ బీచ్‌లకు 15 కిలోమీటర్ల దూరమే. పోర్టు సందర్శకులు, అమ్మవారి భక్తులకు మానసిక ఉల్లాసాన్ని పంచేందుకు ఈ రెండు బీచ్‌లు దోహదపడతాయి. వేసవి సెలవుల్లో కుటుంబసమేతంగా వచ్చి సేద తీరవచ్చు. ప్రీవెడ్డింగ్ షూటింగ్‌లకు కొందరు ఈమధ్య ఆసక్తి చూపుతున్నారు. 10 నెలల క్రితం పర్యాటకంగా ఈ రెండింటినీ అభివృద్ధి చేసేందుకు పర్యాటకశాఖ, రెవెన్యూశాఖ అధికారులు పరిశీలించారు. ఇప్పటివరకు ఆదిశగా ఎటువంటి చర్యలూ ప్రారంభం కాలేదు.

తిరుమలలో బిహారీలు

● బాలాజీనగర్‌లో నివాసం

● భద్రతా తనిఖీల్లో గుర్తించిన పోలీసులు



ఇతర రాష్ట్రాలకు చెందిన వారి వివరాలు నమోదు చేస్తున్న పోలీసులు

తిరుమల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):తిరుమల కొండపై ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు చాలా మంది నివాసం ఉంటున్నట్టు టీటీడీ గుర్తించింది. తిరుమలలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసే చర్యల్లో భాగంగా చేపడుతున్న తనిఖీల్లో ఈ విషయం బయటపడింది. వీరిలో అత్యధికంగా బీహార్‌వాసులున్నట్టు గుర్తించారు. స్థానికులు నివసించే బాలాజీనగర్‌లో బీహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు చెందినవారు ఉన్నట్టు వెల్లడైంది. వీరంతా హోటల్ కార్మికులు. తిరుమలలోని ప్రయివేటు హోటల్ యజమానులు బాలాజీనగర్‌లోని ఇళ్లను అద్దెకు తీసుకుని వీరికి కేటాయిస్తున్నారు. వీరి ఆధార్, ఇతర గుర్తింపు పత్రాలను తిరుమల పోలీసులు సేకరిస్తున్నారు. అలాగే ఎలాంటి గుర్తింపు లేకుండా తిరుమలలో షెడ్లు ఏర్పాటు చేసుకుని నివాసముంటున్న వారిని గుర్తించి తిరుపతికి తరలిస్తున్నారు. ఈ షెడ్లను తొలగిస్తున్నారు.

భక్తుల బ్యాగ్ భద్రంగా..



బ్యాగులోని బంగారు తాళిబొట్టు చైన్‌ను అందజేస్తున్న పోలీసులు

తిరుమల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అలిపిరి స్కానింగ్ కేంద్రంలో మర్చిపోయిన బ్యాగును తిరుమల పోలీసులు భక్తులకు తిరిగి అప్పగించారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ శ్రీధర్ బోపన్న, డాక్టర్ ప్రజ్ఞశ్రీ దంపతులు కుటుంబంతో కలిసి బుధవారం ఉదయం కాలినడకన తిరుమలకు చేరుకునేందుకు అలిపిరికి చేరుకున్నారు. అక్కడ బ్యాగుల స్కానింగ్ కేంద్రంలో 80 గ్రాముల బంగారు తాళిబొట్టు గొలుసున్న బ్యాగును మరచిపోయారు. ఆయన తిరుమల పోలీసులను ఆశ్రయించగా కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. దీంతో ఆ బ్యాగు పొరపాటున మరో భక్తుడి లగేజీలో చేరినట్టు గుర్తించారు. వెంటనే ఆభక్తుడిని సంప్రదించి బ్యాగును స్వాధీన పరుచుకుని శ్రీధర్ బోపన్నకు బ్యాగును అందజేశారు. నాలుగు గంటల వ్యవధిలోనే బ్యాగును గుర్తించి తిరిగి భక్తులకు అందజేసిన తిరుమల సీఐ శ్రీరాముడు, ఎస్‌ఐలు లక్ష్మణ్, చలపతిలను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

ఆరుగురు 'ఎర్ర' స్మగ్లర్లకు ఆరేళ్ల జైలు

● రూ.ఆరు లక్షల చొప్పున జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఆరుగురు స్మగ్లర్లకు ఆరేళ్ల జైలు శిక్షతో పాటు రూ.ఆరు లక్షలు చొప్పున జరిమానా విధిస్తూ గురువారం ఎర్రచందనం స్పెషల్ కోర్టు ఏడీజే న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాసులు కథనం మేరకు.. ఎనిమిదేళ్ళ క్రితం కరకంబాడి ఫారెస్టు బీటు టీఎన్ పాలెం సెక్షన్, తిరుపతి రేంజ్ పరిధిలో జిల్లాకు చెందిన చాంద్‌బాషా, అవినాష్, నాగరాజు, ధనశేఖర్, వరదరాజులు, ఎం.నాగరాజు ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్నారు. దీనిపై ముందుగా అందిన సమాచారం మేరకు అప్పటి టాస్క్‌ఫోర్సు అధికారులు వీరిని పట్టుకుని అరెస్టు చేశారు. అప్పట్లో వీరు బెయిల్‌పై బయటకు వచ్చారు. ఇదే కేసు మళ్లీ తిరుపతి ఎర్రచందనం స్పెషల్ కోర్టుకు కేసు పూర్వాపరాలను టాస్క్‌ఫోర్సు పోలీసులు అందించారు. ఈ క్రమంలో నేరం చేశారని రుజువు కావడంతో ఆ ఆరుగురు స్మగ్లర్లకు న్యాయమూర్తి ఆరేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికీ రూ.ఆరు లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితులను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

మత్తు వీడండి.. జీవితాన్ని గెలవండి

● యాంటీ డ్రగ్స్ ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ పిలుపు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 26(ఆంధ్రజ్యోతి): 'ఇటీవల యువత డ్రగ్స్ బారిన పడుతున్నారు. ఆ మత్తులో ఇతర నేరాలకు.. మహిళల మీద అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. మరోవైపు వారి ఆరోగ్యమూ క్షీణిస్తోంది. అందుకని ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలి. యువత కూడా మత్తు వీడటం ద్వారా జీవితాన్ని గెలవచ్చు' అని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా గురువారం తిరుపతిలో ఆర్డీవో కార్యాలయం నుంచి ఎంఆర్‌పల్లె సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్ నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయాలనే దృఢ సంకల్పంతో సీఎం చంద్రబాబు ఉన్నారన్నారు. కొంతమంది యువకులను డ్రగ్స్, గంజాయి అనే మత్తు పదార్థాలు పట్టిపీడిస్తున్నాయని ఎస్పీ హర్షవర్ధనరాజు ఆందోళన వ్యక్తంచేశారు.



ఎంఆర్‌పల్లె సర్కిల్ వద్ద జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

అలాంటి యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మన స్నేహితులు మాదక ద్రవ్యాలు తీసుకుంటుంటే మౌనంగా ఉండటం మంచిది కాదన్నారు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్ తీసుకుంటున్నట్లు మీ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అప్పుడే ఈ మహమ్మారిని నివారించగలమన్నారు. 'డ్రగ్స్ ప్రభావం సమాజం మీద ఎలా ఉంటుంది? దీని నిర్మూలనకు ఎలా కృషి చేయాలనే దానిపై పాఠశాల, కళాశాలల్లో ఇతర శాఖల సమన్వయంతో మేము ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం' అని ఎస్పీ వివరించారు. పోలీసులకు సమాచారం ఇద్దాం.. డ్రగ్స్ నివారిద్దాం నినాదంతో ముందుకెళదామని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వద్దు..జీవితం ముద్దు అంటూ ర్యాలీలో విద్యార్థులు, యువత నినాదాలు చేశారు. ప్లకార్డులతో ప్రజల్లో అవగాహన కల్పించారు. అందరిచేత డ్రగ్స్ నియంత్రణ ప్రతిజ్ఞ చేయించారు. ఎంఆర్‌పల్లె సర్కిల్ వద్ద మానవహారంగా నిలబడ్డారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ నేత శ్రీనివాసులు, కూటమి నాయకులు, కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, శ్రీపద్మావతి మహిళా వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజిని, అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, అదనపు కమిషనరు చరణ్‌తేజరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. కాగా, డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కల్పిస్తూ జిల్లా వ్యాప్తంగా పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్ ర్యాలీలు నిర్వహించారు.

ప్రాథమిక పాఠశాలకు తాళం

● విలీనంపై విద్యార్థుల నిరసన

కేవీబీపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): తమ ఊరి పాఠశాల తరగతులను మరో గ్రామ పాఠశాలలో విలీనం చేయవద్దంటూ కేవీబీపురం మండలం బంగారమ్మ కండ్రిగలోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గురువారం ఆందోళన చేశారు. ఇక్కడి ప్రాథమిక పాఠశాలలో 38 మంది విద్యార్థులున్నారు. ఇటీవల ఈ స్కూలును రెండున్నర కిలోమీటర్ల దూరంలోని ఎస్ఎన్ కండ్రిగ పాఠశాలలో విలీనం చేశారు. తమ పిల్లలు అంత దూరం వెళ్లి చదవడం కష్టంగా ఉంటుందంటూ తల్లిదండ్రులు తాళం వేశారు. చేసేదిలేక ఉపాధ్యాయుడు బయట కూర్చుని సమయం అయ్యాక వెళ్లిపోయారు.





బంగారమ్మ కండ్రిగ స్కూలు ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన - తాళం వేయడంతో బయట కూర్చున్న ఉపాధ్యాయుడు

రాజకీయ ముఖచిత్రం మారబోతోంది

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు



చైతన్య రథాలను ప్రారంభిస్తున్న బీసీ సంక్షేమ సంఘ నేతలు

తిరుపతి అర్బన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరా మైదానంలో జూలై 6వ తేదీ జరగనున్న బీసీ ఆత్మగౌరవ సభతో రాజకీయ ముఖచిత్రం మారబోతోందని, రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు రానున్నాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. గురువారం ఉదయం ఆయన బాలాజీకాలనీలోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి, బీసీ ఆత్మగౌరవ సభ ప్రచార చైతన్య రథాలను జెండా ఊపి ప్రారంభించారు. ఆత్మగౌరవ సభతో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని విశ్వసిస్తున్నానన్నారు. జిల్లా అధ్యక్షుడు నాగరాజగౌడ్ మాట్లాడుతూ సభను విజయవంతం చేయడంలో భాగంగా అన్ని జిల్లాల్లో పర్యటించేందుకు ప్రచార రథాలను ప్రారంభించినట్లు వివరించారు. టీడీపీ నేత మబ్బుదేవనారాయణరెడ్డి మాట్లాడుతూ బీసీలు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. బీసీ సంఘం కన్వీనర్ ఆల్మన్‌రాజు, మాజీ మంత్రి పరసారత్నం మాట్లాడుతూ కులమతాలకతీతంగా సభకు ప్రజలు హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ కులసంఘాల నేతలు పాల్గొన్నారు.

చంద్రగిరి హైవేలో లారీ హైజాక్

● రాజంపేట వద్ద పట్టుకున్న పోలీసులు

చంద్రగిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండల పరిధిలోని పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో గురువారం సాయంత్రం లారీ హైజాక్ గురైంది. కర్ణాటక రాష్ట్రం బంగారుపేట నుంచి క్యాబేజీ, క్యాప్సికం లోడుతో లారీ రాజమండ్రికి బయలుదేరింది. గాదంకి టోల్ ప్లాజా వద్ద ఐదుగురు దుండగులు లారీని ఆపి, డ్రైవర్ చరణ్‌కుమార్‌పై దాడి చేసి తీసుకెళ్లారు. డ్రైవరు ఫిర్యాదుతో చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ అనిత లారీ కోసం గాలించారు. పోలీసులు లారీని వెంబడించి, రాజంపేట సమీపంలో పట్టుకొన్నారు. ఐదుగురు దుండగులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

'ఆభ' కార్డుతో రోగి మెడికల్ హిస్టరీ అనుసంధానం

● జాయింట్ కమిషనర్ డాక్టర్ బీసీకే నాయక్



చంద్రగిరి సీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్

చంద్రగిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భవ (ఆభ) కార్డుతో రోగి మెడికల్ హిస్టరీ అనుసంధానం చేయబడుతుందని ఏపీ వీవీపీ జాయింట్ కమిషనర్ విజిలెన్స్ బీసీకే నాయక్ తెలిపారు. గురువారం చంద్రగిరిలోని సీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వార్డులను, పరిసరాలను పరిశీలించారు. ప్రతి రోగి తమ వెంట ఆధార్‌తో పాటు ఆధార్‌కు లింక్ చేసిన మొబైల్ ఫోన్‌ను తీసుకురావాలన్నారు. ఆధార్ కార్డుతో 'ఆభ' కార్డు లింక్ చేయబడుతుందన్నారు. తద్వారా దేశంలో ఏ ఆస్పత్రికి వెళ్లినా రోగి మెడికల్ హిస్టరీ రికార్డు అందుబాటులోకి వస్తుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మెడికల్ హిస్టరీ ద్వారా రోగి సకాలంలో మెరుగైన వైద్య చికిత్సలు అందించడానికి వీలు కలుగుతుందన్నారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆనందమూర్తి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీయూ పీజీ జవాబు పత్రాల మూల్యాంకనంపై ప్రత్యేక శ్రద్ధ

● పది రోజుల్లో పూర్తి చేసేందుకు కసరత్తు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ పరిధిలో పీజీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంపై ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. మూల్యాంకనం ఆలస్యమైనట్టు అధికారులు గుర్తించారు. దీంతో పది రోజుల్లో పీజీ నాలుగు సెమిస్టర్ల జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి అయ్యేందుకు ప్రణాళిక రూపొందించారు. పీజీ 3, 4వ సెమిస్టర్ల మూల్యాంకనం ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ నెల 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. పీజీ 1, 2వ సెమిస్టర్ల మూల్యాంకనం వచ్చే నెల 7 వ తేదీ నాటికి పూర్తి కావాల్సిందేనని స్పష్టం చేశారు. ఇకపై యూనివర్సిటీలోని కాలేజీల వారిగా మూల్యాంకనాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులను నియమించే యోచనలో అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు వర్సిటీ కాలేజీల ప్రిన్సిపాళ్ళకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.

అవార్డు గ్రహీతకు డీఈవో అభినందన



నీలకంఠయ్యను అభినందిస్తున్న డీఈవో కుమార్

రేణిగుంట, జూన్ 26, (ఆంధ్రజ్యోతి) : కరకంబాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నీలకంఠయ్య జాతీయ వినూత్న విద్యారత్న అవార్డు పొందారు. నవాచారిగతి విద్యా గ్రూప్ ఇండియా చతిస్గడ్ బృందం ఆధ్వర్యంలో బుధవారం చత్తీస్‌గఢ్‌లో నిర్వహించిన నేషనల్ ఇన్నోవేటివ్ ఎడ్యుకేషన్ రత్న ఎడ్యుకేషన్ కాన్‌క్లేవ్‌లో ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా నీలకంఠయ్యను గురువారం డీఈవో కెఎన్‌వి కుమార్ నీలకంఠయ్యను సత్కరించారు.

తెలంగాణ పోలీసులపై చర్యలు తీసుకోండి

రేణిగుంట, జూన్ 26, (ఆంధ్రజ్యోతి) : తనను చిత్రహింసలకు గురిచేసిన తెలంగాణ పోలీసులపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీ కార్యాలయంలో గురువారం బాధితుడు చందు ఫిర్యాదు చేశాడు. బాధితుడు సోదరుడు కిరణ్ కథనం ప్రకారం గాజులమండ్యం పారిశ్రామికవాడలో తమ్ముడు చందు మ్యాన్‌పవర్ సప్లై కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల ఝార్ఖండ్ కు చెందిన భార్యాభర్తలు ఇతని వద్ద చేరారు. ఈక్రమంలో మూడు రోజుల క్రితం తెలంగాణ పోలీసులు వచ్చి హైదరాబాదులో దొంగతనం చేసి పరారీ అయి ఇక్కడ చేరిన దంపతుల గురించి ఆరా తీశారు. చందు సమాచారంతో పోలీసులు ఆ ఇద్దరినీ హైదరాబాద్‌కు తరలించిందన్నారు. రెండు రోజుల తర్వాత చందును అదుపులోకి తీసుకుని చోరి సొత్తు ఇవ్వాలని రోజంగా వాహనంలో తిప్పి తీవ్రంగా హింసించారన్నారు. ఈ విషయంపై డిఎస్పీ కార్యాలయం చేరుకుని తెలంగాణ పోలీసులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశామని వివరించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ గురువారం స్థానికంగా ఉన్న తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్యఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన 21 మందికి రూ.13.37 లక్షల చెక్కులను అందించామన్నారు. ఎవరైనా సీఎం సహాయనిధి నుంచి ఆర్థికసాయం పొందాలంటే తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అనంతరం గ్రీవెన్స్ డే నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, వాటంబేడు శివకుమార్, పెంచలయ్య, అమరేంద్ర, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, చంద్రమౌళి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ డీఈ షబ్బీర్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం:సీఐ



ర్యాలీలో సీఐ సురేంద్రనాయుడు, ఎక్సైజ్ సీఐ మురళీమోహన్ తదితరులు

పుత్తూరు అర్బన్, జూన్ 25(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం పోలీస్, ఎక్సైజ్, మున్సిపల్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, ఐసీడీఎస్ తదితర విభాగాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కల్యాణపురం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ నియంత్రణపై యువత నినాదాలతో హోరెత్తించారు. సీఐ సురేంద్రనాయుడు, డీఈ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్ఐ ఓబయ్య, ఎక్సైజ్ సీఐ మురళీ మోహన్, ఎస్ఐ అంజాద్ భాషా, సీడీపీవో ప్రమీళ, ఇతర శాఖాధిపతులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. **వడమాలపేట**: పోలీసుల ఆధ్వర్యంలో వడమాలపేట ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ ధర్మారెడ్డి, విద్యార్థులు, అధికారులు, టీడీపీ నాయకులు ధనంజయులు నాయుడు, మణిరాజు, మునిశేఖర్, లక్ష్మీప్రసన్న, శివ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది నిరసన

పుత్తూరు అర్బన్, జూన్ 25(ఆంధ్రజ్యోతి): సమాన పనికి సమాన వేతనం చెల్లించాలంటూ మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేద్కర్ కూడలి వరకు వారు నిరసన ర్యాలీ నిర్వహించారు. అవుట్ సోర్సింగ్ సిబ్బందికి టైం స్కేల్ వర్తింపచేయాలన్నారు. కనీస వేతనం రూ.29 వేలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక యూనియన్ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహా రుద్రాభిషేకం

వడమాలపేట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక భవానీ శంకర దేవాలయంలో మహాశివుని జన్మ నక్షత్రం ఆరుద్ర సందర్భంగా గురువారం మహా రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం సదాశివుడి మహాలింగానికి వేదమంత్రాలతో అభిషేకం నిర్వహించారు.. మహాశివుని లింగాన్ని పూలమాలతో అలంకరించి మంగళ హారతులిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు.

ధర్మరాజ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గాలి జీవరత్నంనాయుడు

పుత్తూరు టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మరాజుల ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని టీడీపీ పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు పేర్కొన్నారు. పుత్తూరులో ద్రౌపది దేవి ఆలయం వద్ద గురువారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ఏటా వార్షిక బ్రహ్మోత్సవాల్లో అన్నివర్గాలకు ఉభయ ప్రదానంలో బాగస్వామ్యం ఉందన్నారు. జూలై 24 నుంచి ఆగస్టు 11 వరకు జరిగే ఈ బ్రహ్మోత్సవాలను కలిసి కట్టుగా పూర్తి చేయాలన్నారు. ఆలయ ఆవరణలో ద్రౌపది అమ్మవారి 40 అడుగుల విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని ఆలయ నిర్వాహకులు నిర్ణయించారన్నారు. ఇందుకు దాతలు సహకరించాలన్నారు. సమావేశంలో ఆలయ కోవిళ్లకార్ సాల్వాకం కృష్ణప్ప మెదలి మున్సిపల్ మాజీ చైర్మన్ యుగంధర్, ఆలయ నిర్వాహకులు, కుల సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



గూడూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో గురువారం పోలేరమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. గ్రామంలో పోలేరమ్మను ప్రతిష్ఠించి ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పొంగళ్లుపెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. జాతరకమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై ఉంచి మంగళవాయిద్యాలు, బాణాసంచా పేళ్లుళ్ల నడుమ వైభవంగా గ్రామోత్సవం జరిపించారు. అనంతరం అమ్మవారిని నిమజ్జనం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

నట్టల నివారణ మందు పంపిణీ

గూడూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాల ఆధ్వర్యంలో గురువారం జీవాలకు నట్టల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సురేష్ మాట్లాడుతూ గురువారం నుంచి వచ్చేనెల 10వ తేదీ వరకు ఉచితంగా నట్టల నివారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జీవాల్లోని అనారోగ్య సమస్యలను తొలగించేందుకు నట్టల నివారణ మందులను తాగిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, పాడిరైతులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారం



ర్యాలీలో మాట్లాడుతున్న సీఐ రమణ

వెంకటగిరిటౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ రమణ సూచించారు. గురువారం స్థానిక విశ్వోదయ జూనియర్ కళశాల నుంచి పుర వీధుల్లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసగా మారకూడదన్నారు. భవిష్యత్తును నాశనం చేసుకోరాదని కోరారు. మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై ఎటువంటి సమాచారం తెలిసినా 1972కు ఫోన్ చేసి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ ఏడుకొండలు, పులికల్లు రాజేశ్వరరావు, గంగాధర్, ఆనంద్, రామచంద్రయ్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో పట్టపగలే చోరీ

నాయుడుపేట టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజగోపాలపురం 3వ వీధిలో పట్టపగలే చోరీ జరిగింది. రాజగోపాలపురం 3వ వీధిలో నివసిస్తున్న సిద్ధలయ్య ఆర్టీసీ బస్టాండ్‌లో రోజువారి కూలీగా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం ఆయన భార్య ఇంటికి తాళాలు వేసి భర్తకు భోజనం తీసుకెళ్లింది. తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగిలిపోయి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. అందులోని 2 సవర్ల బంగారు ఆభరణాలు కనిపించలేదు. వెంటనే భర్త సిద్ధలయ్యతో కలిసి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం



ముఖేష్ (ఫైల్)

కోట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : కోట పట్టణంలోని జయరామ్‌నగర్‌కు చెందిన ముఖేష్ (18) అదృశ్యం కావడంతో గురువారం అతడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుజరాత్ ప్రాంతానికి చెందిన ముఖేష్ తల్లిదండ్రులు కొద్ది సంవత్సరాలుగా కోటలో టీ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ముఖేష్ రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు.

ఓఫారం లేకుంటే లైసెన్స్‌లు రద్దుచేస్తాం

కోట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఎరువుల దుకాణం దారులు తమ షాపులకు ఆమోదం పొందిన ఓ ఫారం ఉండాలని లేకుంటే ఆ దుకాణాలను సీజ్ చేస్తామని ఏవో సుచేంద్రప్రసాద్ హెచ్చరించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో గురువారం ఎరువులు, పురుగు మందుల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సహాయ వ్యవసాయ అధికారి సాయికుమార్ తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

గూడూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్‌శాఖ ఏఈఎస్ ఊహసిరి అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి టవర్‌క్లాక్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిషేధిత పొగాకు ఉత్పత్తులు, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలను సేవించడం వలన అనారోగ్యాల బారిన పడుతారన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైతే భవిష్యత్తు నిర్వీర్యమవుతుందని తెలియజేశారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. సమాజంలో మాదకద్రవ్యాలను నియంత్రించడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. డ్రగ్స్ వినియోగం ఆరోగ్యాన్ని హానికరమే కాకుండా చట్టరీత్యా నేరమన్నారు. డ్రగ్స్‌ను వినియోగించినా, అమ్మకాలు సాగించినా, అక్రమరవాణా చేపట్టినా కఠిన శిక్షలు ఉంటాయన్నారు. ప్రతిఒక్కరూ డ్రగ్స్ రహిత సమాజానికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు కిషోర్‌బాబు, శేఖర్‌బాబు, శ్రీనివాసులు, బాలకృష్ణ, కరీమాబేగం, సూర్యనారాయణ, సురేంద్రబాబు, ఎస్ఐలు శేషమ్మ, ఎండీ.రఫీ, మనోజ్‌కుమార్, తిరుపతయ్య, గోపాల్, సురేష్‌బాబు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ సంగమేశ్వరరావు

పెళ్లకూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాలు, మద్యం, ఇతర మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం పెళ్లకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఎంఈవో కార్యాలయం రహదారి మీదుగా పోలీస్ స్టేషన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సంగమేశ్వరరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిశితంగా పరిశీలించి తగిన జగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ ర్యాలీలో ఎంపీడీవో ప్రమీలారాణి, డిప్యూటీ తహసీల్దార్ యువ రాజు, డాక్టర్ పీ. జితేంద్ర, ఎంఈవో-2 మించల శంకరయ్య, సీహెచ్‌వో శివారెడ్డి, వీఆర్వో వంశీకృష్ణ, రమణయ్య, పంచాయతీ కార్యదర్శి రమాప్రభ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నట్టల నివారణతో జీవాలు సురక్షితం



నట్టల నివారణ మందును వేస్తున్న కృష్ణయ్య, అధికారులు

పెళ్లకూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : నట్టల నివారణ మందుతో మూగ జీవాల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి సురక్షితంగా ఉంటాయని పశుసంవర్ధక శాఖ ఏడీ ధనుంజయులు పేర్కొన్నారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య చేతుల మీదుగా నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని చెంబేడు, పునబాక, పెళ్లకూరు పశు వైద్యశాలల పరిధిలో మూడు బృందాలను ఏర్పాటు చేసి 24 పంచాయతీలోని 2950 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ జే అమరావతి, పశుసంవర్ధక సహాయకులు నిర్మోరాణి, ముకుంద తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల బాధితుడికి న్యాయం జరగాలని నేటి నుంచి నిరసనదీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న వామపక్షనేతలు

వెంకటగిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గత ఏడాది గ్రామశక్తి పోలేరమ్మ జాతరలో పోలీసుల దాడిలో గాయపడిన దళితుడు చెంచుకుమార్‌కు న్యాయం చేయాలని వామపక్షనేతలు, దళిత, గిరిజన సంఘాల నేతలు శుక్రవారం నుంచి నిరసన దీక్షలు చేపట్టనున్నారు. గురువారం వారు స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గాయపడిన చెంచు కుమార్‌కు రెండెకరాలు భూమి, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పిన హామీ నేటికీ నెరవేరలేదన్నారు. ఆ హామీ అమలుకోసం నిరసనదీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ దీక్షల్లో దళిత, గిరిజన, వామపక్ష నేతలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య, వెంకటగిరి ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి పల్లిపాటి రవి, దళిత, గిరిజన సంఘాల నేతలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను అడ్డుకుంటాం



ఎస్ఐ స్వప్న ఆధ్వర్యంలో మానవహారంగా నిలుచుని ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

ఓజిలి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సహకారంతో గ్రామీణ ప్రాంతాలలో గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల వినియోగాన్ని అడ్డుకుంటామని ఓజిలి ఎస్ఐ స్వప్న అన్నారు. ఓజిలిలో గురువారం మత్తు పదార్థాల నిర్మూలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి మహిళలు, విద్యార్థులు, పలు శాఖల అధికారులు బస్టాండు వరకు ర్యాలీ చేపట్టారు. బస్టాండు వద్ద మహిళలతో మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేశారు ఏపీఎం పద్మ, పొదుపు మహిళలు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



ఉచ్చూరులో ఘటనా స్థలిలో బాధితురాలితో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు

దొరవారిసత్రం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : దొరవారిసత్రం మండలం ఉచ్చూరు గ్రామంలో అట్రాసిటీ కేసుపై గురువారం నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు విచారణ చేపట్టారు. ఈనెల 19న ఆగ్రామ దళిత కాలనీకి చెందిన బద్ది బుజ్జమ్మపై అదే గ్రామానికి చెందిన చిట్టేటి మునిరెడ్డి దౌర్జన్యం చేసినట్లు అందిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ జరిపారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల విషయంలో బాధితురాలు బుజ్జమ్మ, మునిరెడ్డి మధ్య వాదనలు రావడంతో మునిరెడ్డి బుజ్జమ్మను తోసివేయడంతో ఆమెకు ఎడమ చేయికి గాయమవడంతో బాధితురాలు స్థానిక పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదుపై విచారణకు వెళ్లిన డీఎస్పీ చెంచుబాబు ఘటనా స్థలిని పరిశీలించారు. బాధితురాలితో మాట్లాడారు. గ్రామంలోనూ విచారణ చేపట్టారు. విచారణలో డీఎస్పీ వెంట స్థానిక ఎస్ఐ అజయ్‌కుమార్ ఉన్నారు.

రాత్రికి రాత్రే జామాయిల్ నరికివేత



అక్రమార్కులు నరికివేసిన జామాయి



గ్రామస్తులు పట్టించిన ట్రాక్టర్

కోట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : కోట మండలం మద్దాలి సమీపంలో ఉన్న జామాయిల్ చెట్లను రాత్రికి రాత్రేనరికి తరలిస్తున్న దుండగులను గ్రామస్తులు గురువారం పోలీసులకు పట్టించారు. మద్దాలి సమీపంలో వనసంరక్షణ సమితులు, పంచాయతీ ఆధ్వర్యంలో 30 ఎకరాల అటవీశాఖ భూముల్లో జామాయిల్ చెట్లను సాగు చేపట్టారు. ఓజిలి మండలానికి చెందిన పలువురు గుట్టుచప్పుడు కాకుండా రాత్రికి రాత్రే జామాయిల్‌ను రంపాలతో కోసి ట్రాక్టర్‌లో లోడ్ చేసుకొని బయట ప్రాంతాలకు విక్రయిస్తున్నారు. అందులో భాగంగానే బుధవారం రాత్రి ట్రాక్టర్‌ను జామా యిల్ తోటలో ఉంచి అక్రమంగా నరికి లోడ్ చేస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో దుండగులు ట్రాక్టర్‌ను వదిలి పరారయ్యారు. ఇద్దరిని పట్టుకొని ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై మానవహారం



చిట్టమూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి) : మాదకద్రావ్యాల నియంత్రణ, అక్రమ రవాణాపై వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం చిట్టమూరులో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో మనోహర్ గౌడ్ ఆధ్వర్యంలో ఎస్ఐ చిన్న బలరామయ్య, అధికారులు, విద్యార్థులు చిట్టమూరు నుంచి కొత్తగుంట కూడలి వరకు మాదక ద్రవ్యాలను నిర్మూలించాలని, మాదకద్రావ్యాల అక్రమ రవాణాను అరికట్టాలని నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. కొత్తగుంట కూడలిలో మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో కోట ఐసీడీఎస్ సీడీపీవో మునికుమారి, చిట్టమూరు వైద్యాధికారి సుచేంద్ర, హౌసింగ్ ఏఈ సుధీర్, ఏపీఎం గున్నయ్య, ఏపీవో షీలు ఉన్నారు.

డ్రగ్స్ వినియోగంపై ర్యాలీ

తడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ వినియోగంపై స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జరిగింది. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. బస్టాండ్ కూడలిలో మానవ హారం ఏర్పాటు చేశారు. ఎస్ఐ కొండప్ప నాయుడు, ఎంఈవో మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం



ర్యాలీలో పాల్గొన్న సీఐ హుస్సేన్‌బాషా, ఎంపీడీవో శ్రీనివాసులు తదితరులు

వాకాడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల అలవాటుతో భవిష్యత్తు నాశనం అవుతుంద సీఐ హుస్సేన్‌బాషా అన్నారు. ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం విద్యార్థులతో కలసి మండల పరిషత్ కార్యాలయం నుంచి అశోక్ పిల్లర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగబాబు, డిప్యూటీ తహసీల్దారు సందీప్, ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వరరావు, ఎంఈవో నసీం ఆలీ, ఏవో దీప, ఏపీవో విజయ తదితరులు పాల్గొన్నారు.


బాలయపల్లి: బాలయపల్లిలో డ్రగ్స్ నియంత్రణపై ఎస్ఐ గోపీ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నియంత్రణపై ర్యాలీ జరిగింది. డిప్యూటీ ఎంపీడీవో మోహన్‌రాజు, సీడీపీవో షంషాద్ బేగం, ఏపీఎం కిరణ్ మానవహారం చేపట్టారు.

కోట: ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో మండలస్థాయి అధికారులు, విద్యార్థులు, పంచాయతీ కార్యదర్శులు, సచివా లయ సిబ్బంది మాదక ద్రవ్యాల వినియోగంపై కోటలో అవగాహన ర్యాలీ చేపట్టారు. సీడీపీవో మునికుమారి, ఏపీఎం అనీల, ఎస్ఐ పవన్‌కుమార్, మెరైన్ పోలీసులు ఉన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు బుగ్గిపాలు



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయశ్రీ, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, నాయకులు రమేష్, కిషోర్ తదితరులు



నాయుడుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

నాయుడుపేట, జూన్ 26 : మాదక ద్రవ్యాలను వినియోగిస్తే వారితోపాటు వారి కుటుంబసభ్యుల జీవితాలు బుగ్గిపాలు అవుతాయని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా అన్నారు. మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక గాంధీ మందిరం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి, ఎస్ఐ ఆదిలక్ష్మి, ఎంపీడీవో సురేష్‌బాబు, ఎంఈవో మునిరత్నం, డాక్టర్ గురవయ్య, దార్ల రాజేంద్ర, సీడీపీవో ఉమామహేశ్వరి ఉన్నారు.

సూళ్లూరుపేట: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలంటూ ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మాదరకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నివారణ దినోత్సవం సందర్భంగా సూళ్లూరుపేట పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక హోలీక్రాస్ కూడలి వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు వరకు జరిగిన ర్యాలీలో ఆమె మాట్లాడారు. ఆర్టీసీ బస్టాండు వద్ద మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, ఎస్ఐ బ్రహ్మానాయుడు, ఎంఈవో శ్రీనివాసులు, సీడీపీవో జ్యోతికిరణ్, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, టీడీపీ నాయకులు వెంకటస్వామి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

బాలిక పట్ల అసభ్య ప్రవర్తన ఒకరిపై కేసు నమోదు

రేణిగుంట, జూన్ 26, (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఆయన కథనం మేరకు తిరుపతికి చెందిన బ్యాంకు ఉద్యోగి కుటుంబం ఎల్లమండ్యం జాతరలో పాల్గొనేందుకు బుధవారం జాతరలో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చారు. స్థానికంగా ఉన్న రాజు అనే యువకుడు మద్యం మత్తులో ఆ కుటుంబానికి మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. గురువారం బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడు రాజుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మేథో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. వినాయక పూజల కలశ పూజ వైదిక క్రతువులు ముగిశాక స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అన్నదానం



శ్రీకాళహస్తి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెండ్లిమండపం వద్ద జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత ఆధ్వర్యంలో గురువారం డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కావలి శివకుమార్, తోట గణేష్, నితీష్‌కుమార్, లక్ష్మి, రాజ్యలక్ష్మి, మాలతి, సిద్దులగారి ప్రసాద్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ శిక్షణ తరగతుల పోస్టర్ల ఆవిష్కరణ



శ్రీకాళహస్తి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ జిల్లా స్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ కోరారు. గురువార ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జూలై11, 12, 13 తేదీల్లో తలకోనలో తరగతులు జరుగుతాయన్నారు. ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు తరగతులు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కోగిలి మునిచందు, అశోక్, ఆసిఫ్, మునితేజ, చైతన్య, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ సర్టిఫికెట్ల అందజేత



సర్టిఫికెట్లను అందజేస్తున్న డీఎస్పీ

శ్రీకాళహస్తి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక పరిపుష్టి చెందాలని డీఎస్పీ నరసింహమూర్తి ఆకాంక్షించారు. పట్టణంలోని సిటిజన్స్ వెల్ఫేర్‌ఫోరం కార్యాలయంలో ఉచిత టైలరింగ్, ప్యాషన్ డిజైనింగ్, ఆర్యవర్క్, బ్యూటీషియన్ శిక్షణ పూర్తి చేసుకుని మహిళలకు గురువారం ఆయన సర్టిఫికెట్లను అందజేశారు. సంస్థ ప్రధాన కార్యదర్శి కోలా వెంకటేశ్వరరావును ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు యువత నేతకు శుభాకాంక్షలు



ప్రతాప్‌రెడ్డిని అభినందిస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ తొట్టంబేడు మండలం కన్నలిలో తెలుగు యువత నేత ప్రతాప్‌రెడ్డికి గురువారం పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. టీడీపీ నేత ఉన్నం ప్రసాద్ నాయుడు, శ్రీకాళహస్తి జడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి, మాజీ జడ్పీటీసీ వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నీర్పాకోట గ్రామంలోని సూళ్ళూరుపేట రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్‌కు ట్రాన్స్‌కో అధికారులు మరమ్మతులు చేపట్టారు. తుపానుకు పడిపోయిన వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టాలని గత వారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఏఈ చలపతి స్పందించారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం మునెయ్య

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి ప్రభుత్వం ప్రోత్సహం అందిస్తోందని వెలుగు ఏపీఎం మునెయ్య చెప్పారు. మండల వెలుగు కార్యాలయంలో గురువారం మహిళా సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ లక్ష్యంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులలో ఆసక్తి, అర్హత కలిగిన వారు పీఎం ఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, సీఐఎస్ ఉన్నతి, స్త్రీనిధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డెయిరీ ఏపీఎం రేవతి, ప్రకృతి వ్యవసాయ కో-ఆర్డినేటర్ వెంకటాచలం, సీసీలు సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు: ఎంపీడీవో

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల సహకారంతో తాగునీటి సమస్య, డ్రైనేజి కాలువలు శుభ్రం చేయించాలన్నారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించాలన్నారు. పెండింగ్ సమస్యలు ఉంటేతన దృష్టికి తీసుకురావాలన్నారు.

వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్ద రేషన్ పంపిణీ



వరదయ్యపాళెం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దరే రేషన్ సరుకులను డీలర్లు పంపిణీ చేశారు. రేషన్‌దుకాణం డీలరు రవి ఆధ్వర్యంలో ఉదయం పలువురు వృద్ధుల ఇళ్లకు వెళ్లి రేషన్ సరుకులను పంపిణీ చేశారు. ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించడంతో సంతోషంగా ఉందని వృద్ధులు, వికలాంగులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న పథకాలను చేనేత కార్మికులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. గురువారం నారాయణవనంలో పంచాయితీ కార్యాలయంలో చేనేత స్మాల్ క్లస్టర్ డెవలప్మంట్ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు రమేష్ హాజరయ్యారు. ఆదిమూలం మాట్లాడుతూ 20 శాతం మార్జిన్‌తో ముద్ర రుణాలు బ్యాంకుల నుంచి పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో చేనేత శాఖ సహాయ అభివృద్ధి అధికారులు కిరణ్‌కుమారి, పృథ్వీరాజ్, ఎంపీపీ దివాకర్ రెడ్డి, లిడ్ క్యాప్ మాజీ చైర్మన్ ఏకాంబరం, చేనేత నాయకులు గుత్తి త్యాగరాజు, మాజీ ఎంపీపీ గోవిందస్వామి, సింగల్ విండో చైర్మన్ ఊరప్పన్, మాజీ వైస్ ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్, ఈవో, చేనేత నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి ఇంట్లో చోరీ

కేవీబీపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆరె గ్రామంలో బుధవారం రాత్రి టీడీపీ నేత ప్రకాష్‌నాయుడు ఇంట్లో చోరీ జరిగింది. పుత్తూరు రూరల్ సీఐ రవీంద్ర, ఎస్ఐ నరేష్ కథనం మేరకు ప్రకాష్‌నాయుడు కుటుంబంతో షిరిడీ యాత్రకు వెళ్లారు. అన్న యుగంధర్‌నాయుడిని ఇంటి వద్ద ఉంచి వెళ్లారు. బుధవారం రాత్రి యుగంధర్ రాలేదు. ఇదే అదనుగా దొంగలు ప్రహరీ దూకి, ప్రధాన ద్వారం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలోని నగలు, వెండి, డబ్బు చోరీ చేశారు. ప్రకాష్‌నాయుడి వస్తే చోరీ సొత్తు వివరాలు తెలుస్తాయని సీఐ తెలిపారు. క్లూస్ టీం వేలిముద్రలను సేకరించింది.

ఎమ్మెల్యే ఆదిమూలం పరామర్శ

పిచ్చాటూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కీళపూడిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి జి.వాసుదేవరాజు కుటుంబసభ్యులను ఎమ్మెల్యే ఆదిమూలం గురువారం పరామర్శించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, టీడీపీ నాయకులు పద్మరాజు, జయచంద్రనాయుడు, వాసురెడ్డి, భక్తారెడ్డి, ముద్దుకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: తొండంబట్టు పంచాయతీకి చెందిన టీడీపీ నాయకుడు భాస్కర్‌నాయుడు అల్లుడు మృతికి ఎమ్మెల్యే ఆదిమూలం నివాళులు అర్పించారు. భాస్కర్‌నాయుడు కుటుంబాన్ని ఓదార్చారు. టీడీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి, నందకిషోర్‌రెడ్డి, ఇలంగోవన్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనధికార స్టిక్కర్లు అంటిస్తే చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పోలీసు, ప్రెస్ స్టిక్కర్లను వాహనాలపై అనధికారికంగా వేసుకుంటే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ సీహెచ్ గోవిందు హెచ్చరించారు. గురువారం 1వ పట్టణ సీఐ గోపి ఆదేశాల మేరకు పట్టణంలోని పలుచోట్ల ప్రెస్, పోలీసు స్టిక్కర్లు కలిగిన వాహనాలపై కేసులు నమోదు చేసి వారిచేత స్టిక్కర్లను తొలించారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీసు, ప్రెస్ విధులకు సంబంధం లేని వారు స్టిక్కర్లు వేసుకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

మా పాఠశాలను మార్చొద్దు



పాఠశాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన

వరదయ్యపాళెం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): తమ పాఠశాలను మార్చవద్దని పాండూరు పంచాయతీ సుబ్బానాయుడుకండ్రిగ పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. గురువారం పాఠశాల వద్ద నిరసన తెలిపారు. వారుమాట్లాడుతూ తమ స్కూలును రెండు కిలోమీటర్ల దూరంలోని మరో పాఠశాలకు తరలించడం సబబు కాదన్నారు. సుబ్బానాయుడుకండ్రిగ, ముట్టంగితిప్ప, పాదిరికుప్పం, సుబ్బానాయుడుకండ్రిగక చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంఈవో సరస్వతికి వినతిపత్రం అందజేశారు.

శ్రీకాళహస్తి: వేడాంకు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఏడు పాఠశాలలను రద్దుచేసి ఎవరికీ అందుబాటులో లేని బీసీకాలనీలో మోడల్ స్కూల్ ఏర్పాటు చేయడం బాధాకరమన్నారు. విద్యార్థులు ఇబ్బందిపడతారన్నారు. తమ పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని వారు కోరారు.

విద్యార్థినికి పాముకాటు

నారాయణవనం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని స్థానిక బాలికల ఉన్నత పాఠశాల తేజశ్రీ అనే విద్యార్థిని గురువారం పాముకాటుకు గురై తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పాఠశాలలో 6 తరగతి చదువుతున్న తేజశ్రీ ఉదయం 11 గంటలకు బాత్‌రూముకు వెళ్లింది. తలుపులు తెరవడంతో లోపలున్న పాము తేజశ్రీ కాలుపై కాటు వేసింది. దీంతో బాలిక అరవడంతో ప్రధానోపద్యాయురాలు మనోహరి చేరుకుని పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించాక మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి పంపామని హెచ్ఎం తెలిపారు. కరిచింది నీటిపాము కావడంతో తేజశ్రీ కి ప్రమాదం తప్పిందన్నారు. జియాలజీ టీచర్ పర్యవేక్షణలో వైద్యశాలలో తేజశ్రీ ఆరోగ్యంగా ఉందని మనోహరి తెలిపారు.

ఎండకు ఎండుతూ..వానకు తడుస్తూ...

నిరుపయోగంగా 25 టన్నుల ఇనుప కమ్మీలు



సత్యవేడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణానికి సంబంధించిన 25 టన్నుల శ్లాబు కమ్మీలు నాలుగేళ్ళుగా ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన వైఎస్సార్ గృహ నిర్మాణ పథకం ప్రచారానికే పరిమితమైంది. ఈక్రమంలో ప్రభుత్వమే నిర్దేశించిన ధరకు స్థానిక హౌసింగ్ ఏఈ కార్యాలయానికి 40 టన్నుల వరకు శ్లాబు కమ్మీలను సరఫరా చేశారు. అప్పట్లో ప్రభుత్వం గృహ నిర్మాణాలపై నిర్లక్ష్యం వహించడంతో నిర్మాణాలు సక్రమంగా జరగక లబ్ధిదారులకు కమ్మీలు అందలేదు. ప్రభుత్వం నిర్దేశించిన ధర అధికంగా ఉండడంతో కొందరు లబ్ధిదారులు కమ్మీలు కొనుగోలు చేసేందుకు విముఖత చూపించారు. దీంతో లబ్ధిదారులు కొనుగోలుచేయక అటు ప్రభుత్వానికి తిరిగి స్వాధీనం చేయకపోవడంతో సుమారు 25 టన్నుల కమ్మీ కార్యాలయ ఆవరణలో నాలుగేళ్ళుగా పడి ఉన్నాయి. తుప్పు పడుతూ పనికిరాకుండా పోతున్నాయి. వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో లక్షల రూపాయల ప్రజా ధనం వృథాగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి వీటిని ఇతర ప్రభుత్వ నిర్మాణాలకు ఉపయోగించాల్సిన అవసరం ఉంది.

నేటి నుంచి ధర్మరాజు ఉత్సవాలు



పనులను పరిశీలిస్తున్న ఈవో బాపిరెడ్డి



ఆలయ ధ్వజస్తంభం ముస్తాబుకు సన్నాహాలు

శ్రీకాళహస్తి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ధర్మ రాజస్వామి ఉత్సవాలు పట్టణంలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా చెన్నైరోడ్డులోని ధర్మరాజస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి జూలై 9 వరకు జరుగుతాయి. శుక్రవారం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 28న పాండవ విద్యాభ్యాసం, 29న హిడింబాసుర, బకాసుర వధ, 30న మత్స్యయంత్ర ఛేదనం, జూలై 1 ద్రౌపది కల్యాణం, 2న రాజసూయ యాగం, 3న ద్రౌపది వస్త్రాపహరణం ఇలా వరుసగా వివిధ కార్యక్రమాలు జరుగుతాయి. వారం రోజుల ముందు నుంచే . ఆలయ పరిసరాలను అధికారులు సుందరంగా ముస్తాబు చేశారు. గురువారం నుంచి విద్యుద్దీపాలంకరణ చేశారు. ఈవో బాపిరెడ్డి గురువారం క్యూలైన్ల ఏర్పాటు, అగ్ని గుండ మహోత్సవం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ





సత్యవేడులో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిమూలం-

సత్యవేడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. డ్రగ్స్ వ్యతిరేక దినం సందర్భంగా గురువారం పురస్కరించుకుని సత్యవేడులో అధికారులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయయ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో త్రివిక్రమరావు, సీఐ మురళి, ఎస్ఐ రామస్వామి, డాక్టర్ సురేష్, డాక్టర్ హరిప్రసాద్, ఎంఈవో రవి, ఎంపీటీసీ టీబీఎస్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. **కేవీబీపురం:** మండల కేంద్రంలో గురువారం డ్రగ్స్ వ్యతిరేక దినం సందర్భంగా ఎస్ఐ నరేష్, పోలీసులు, ఎంపీడీవో మాలతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. దీనివల్ల వచ్చే అనర్థాలను ఎస్ఐ వివరించారు. పంచాయతీ సిబ్బంది, పోలీసులు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు. **బుచ్చినాయుడుకండ్రిగ:** మండల కేంద్రంలో పాఠశాల విద్యార్థులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడు, ఎంపీడీవో వెంకటరత్నమ్మ, ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, ఏపీఎం మునెయ్య పాల్గొన్నారు. **పిచ్చాటూరు:** స్థానిక జడ్పీ హైస్కూలు ప్రాంగణం నుంచి పోలీస్‌స్టేషన్ మీదుగా విద్యార్థులు, మండల స్థాయి అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలసి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వరులు, ఎంపీడీవో మహ్మద్‌రఫీ, సీడీపీవో సౌభాగ్యవతి, ఎంఈవోలు హేమమాలిని, యుగంధర్‌రాజు, డాక్టర్ రాజేష్, టీడీపీ నాయకుడు ఎం.ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు. **శ్రీకాళహస్తి:** డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. టీడీపీ నాయకులు, ఎక్సైజ్,పోలీసు, ఐసీడీఎస్, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ నరసింహమూర్తి, నాయకులు చెంచయ్యనాయుడు, కాసరం రమేష్, సీఐ గోపి, ఐసీడీఎస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **వరదయ్యపాళెం:** జూనియర్ కళాశాలలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ, ఎంఈవో, విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు.

నారాయణవనం: మండల కేంద్రంలో పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు, పంచాయితీ అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. **నాగలాపురం:** మండల కేంద్రంలో ఏవో గుణశేఖర్ అధ్యక్షతన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులు, అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు.

ప్రమాదకరంగా డైవర్షన్ రోడ్డు



కాజ్‌వే వద్ద ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు

నాగలాపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వేంబాకం వద్ద కాజ్‌వే కోసం ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు ప్రమాదకరంగా ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేంబాకం-గోపాలపురం మధ్యలో వాగువద్ద కాజ్‌వే పనులు చేపడుతున్నారు. ఈక్రమంలో వాహనాల రాకపోకలకు బంకమట్టితోలి ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు పటిష్టంగా లేదు. రెండు చినుకులకే కుంగుతూ వాహనాల పట్టుతప్పుతోంది. అదుపుతప్పితే వాహనాలు గుంతలో పడిపోయే అవకాశం ఉంది. గ్రావెల్‌తో పటిష్టంగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

తిరుచానూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గంలో పలువురికి ఎమ్మెల్యే పులివర్తి నాని గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. తనపల్లి రఘునాథ్ రిసార్ట్స్‌లోని టీడీపీ కార్యాలయంలో తిరుపతి, పాకాల, చంద్రగిరి, రామచంద్రాపురం మండలాలకు చెందిన పలువురికి రూ.39,02,291 చెక్కులను అందజేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం అండగా నిలుస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సింహ వాహనంపై పరాశరేశ్వరుడు



నారాయణవనం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ ఆలయం చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి యోగాసనమూర్తి అవతారంలో సింహవాహనంపై ఊరేగించారు. ప్రత్యేక అభిషేకాలు పూర్తయ్యాక స్వామి వారితో సహా అమ్మవారిని ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. సాయంత్రం సింహ వాహనంపై ఊరేగిన చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామికి భక్తులు నారికేలా, కర్పూర నీరాజనాలతో దర్శించుకున్నారు. కార్యక్రమంలో సూపరిటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ క్రిస్టల్ దాస్

సత్యవేడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాదిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాదికారి డాక్టర్ క్రిస్టల్ దాస్ పేర్కొన్నారు. గురువారం సత్యవేడు సబ్‌జైల్‌లో రిమాండ్‌లో ఉన్న వారికి సబ్‌జైల్ సూపరిండెంట్ కరీముల్లా బాష ఆధ్వర్యంలో క్షయవ్యాదిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ క్రిస్టల్ దాస్ మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉన్నట్లయితే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్ళి పరీక్షలు నిర్వహించుకుని వ్యాధి నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయితే ఆందోళన చెందకుండా వైద్యుల పర్యవేక్షణలో ఆరు నెలల పాటు మందులు వాడితే వ్యాధి తగ్గుతుందని తెలిపారు. అనంతరం వైద్య సిబ్బంది పలువురు ఖైదీలకు గళ్ళ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ హర్షవర్ధన్, ఎంపీఈహెచ్ఈవో సుబ్రమణ్యం, టీబీ సూపర్‌వైజర్ అనూష, ఎంఎల్‌హెచ్‌పీ మేఘన, ఏఎన్ఎం మేరి, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: తిమ్మభూపాలపురంలో క్షయ వ్యాధిపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గురువారం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీహెచ్‌వో మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్ధారణకు ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.